దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States

CORPORATE COMMERCE
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios
www.corporatecommerce.in
CA. China Masthan T
94188 66666

సంపుటి : 23 | సంచిక : 259 | ది. 21-12-2024 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

## సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్..

- భూ కబ్జాలు, మోసాలు, బెదిరింపులకు పాల్పడితే జైలే దిక్కు
- భూ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం, రీసర్వేలోని తప్పులనూ సరిచేస్తాం
- ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలనేది నా ఆలోచన, ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలోచన
- ఎంతో నమ్మకంతో 57 శాతం ఓట్లతో మమ్మల్ని గెలిపించారు
- ప్రజల ఆశల్ని నెరవేర్చేందుకు ఆర్నెల్లుగా కష్టపడుతున్నాం
- గత ప్రభుత్వం వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసింది
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన భూమికి దిక్కులేకుండా చేసే పరిస్థితిని తీసుకొచ్చారు
- రెవెన్యూ సదస్సుల ద్వారా 95,263 పిటిషన్లు వచ్చాయి
- దాదాపు 3 లక్షల మంది సదస్సులకు హాజరయ్యారు
- పాస్‌పుస్తకంపై క్యూఆర్ కోడ్, జియో ట్యాగింగ్‌తో ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలించుకునే అవకాశం కల్పిస్తాం

**ఈడుపుగల్లు రెవెన్యూ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**





**కంకిపాడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా, పెనమలూరు నియోజకవర్గంలోని ఈడుపుగల్లు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించి పిటిషన్లను స్వయంగా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 57 శాతం ఓట్లతో గొప్ప మెజారిటీతో గెలిపించి ఎన్‌డీఏ ప్రభుత్వంపై మీరు పెట్టుకున్న ఆశలను నెరవేర్చేందుకు ఆర్నెల్లుగా కష్టపడుతున్నామని.. ఇంకా కష్టపడతామని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాలనేది మా ఆలోచన అని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వం భూకబ్జాలతో మొదలుపెట్టి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసింది. విధ్వసం సృష్టించారు. మన జీవితాలను అంధకారంలోకి నెట్టారు. గతంలో ఎప్పుడూ ఇన్ని ఇబ్బందులు చూడలేదు. ఇది ప్రజా ప్రభుత్వం.. ప్రజల ఆశల మేరకు పనిచేసే ప్రభుత్వం ఇదని స్పష్టమైన హామీ ఇస్తున్నా. ఒకవైపు అవినీతి.. మరోవైపు వ్యవస్థల విధ్వంసం.. అధికార యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయడం.. ఇలా అనేక సమస్యలను సృష్టించారు. ఇప్పటివరకు లక్షా 57 వేల 481 అర్జీలు నా దగ్గరకు వచ్చాయి. రికార్డ్ ఆఫ్ రైట్స్ కోసం 78,854 దరఖాస్తులు వచ్చాయి. ఇంటి జాగా కోసం 9,830 వినతులు, ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి 9,528 ఫిర్యాదులు వచ్చాయి. ఇవికాకుండా గవర్నమెంట్ భూమి కోసం 8,366 దరఖాస్తులు వచ్చాయి. ఆక్రమణలకు సంబంధించి 8,227 వచ్చాయి. అధికార యంత్రాంగంపైన ఫిర్యాదులు 8 వేలు వచ్చాయి. 22ఏ ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. పట్టా భూములను కబ్జాచేశారు. ఒకటి రెండు కాదు కొన్ని వందల కేసులు జరిగాయి. ఇవన్నీ చూసిన తర్వాత నేను ఒక్కటే నిర్ణయించుకున్నాను. మీ భూమిని మీకు ఇప్పించే బాధ్యత తీసుకొని పట్టుదలతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

**భూమి అనేది భవిష్యత్తుకు సంబంధించిన అంశం:** భూమి అనేది ప్రజల భవిష్యత్తుకు సంబంధిం చిన అంశమని.. ఒక గజమైనా, సెంటు అయినా, ఎకరా అయినా ప్రాణంతో సమాన మని ముఖ్యమంత్రి పేర్కొన్నా రు. సర్వస్వంగా భావించే భూమిని గత ప్రభుత్వంలో అడ్డగోలుగా లాక్కున్నారని అన్నారు. భూమికి, మనకు ఉన్న బంధాన్ని తెంచేయాలని చూశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారు. ఈ యాక్ట్‌తో ఆనాటి ముఖ్యమంత్రి గుమస్తాలను పెట్టుకొని మీ భూమిపై పెత్తనం చేసే పరిస్థితికి వచ్చారన్నారు. వారసత్వంగా వచ్చిన లేదా కష్టపడి భూమిని కొనుక్కొంటే దానిపైన ఆయన బొమ్మ వేసుకున్నారు. రాజముద్ర ఉండాల్సిన చోట ఆయన సొంత బొమ్మ వేసుకున్నారు. మనదగ్గర బ్రిటిష్ కాలం నుంచి చాలా పటిష్ఠంగా రికార్డులు ఉన్నాయి. నిజాం పాలనతో పాటు కొందరు హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల తెలంగాణలో రికార్డులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉంటాయి. కానీ.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బ్రిటిష్‌వారు చాలా పకడ్బందీ రికార్డులను నిర్వహించారు. జమాబందీలో మనం డబ్బులుకట్టి

- 8లో

## రణరంగంగా మారిన అసెంబ్లీ



**హైదరాబాద్, డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ఆరో రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. వాయిదా తీర్మానంపై బీఆర్ఎస్ నేతలు చర్చకు పట్టుపట్టారు. ఈ ఫార్ములా కార్ రేసింగ్‌పై చర్చ కోసం బీఆర్ఎస్ నేతలు వాయిదా తీర్మానం ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారంటూ నల్ల బ్యాడ్జీలతో మండలికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వచ్చారు. సభలో ఫార్ములా- ఈ అంశంపైన వెంటనే సభలో చర్చకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు, ఫ్లకార్డులతో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. 420కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలను ప్రశ్నించినందుకే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. ఫార్ములా- ఈ పైన కేసు అక్రమం అంటూ ఫ్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేశారు. దీంతో అసెంబ్లీ రణరంగంగా మారింది. సభలో తమకు కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. దళిత ఎమ్మెల్యేలకు చెప్పు చూపించారని మండిపడ్డారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. స్పీకర్ పోడియం వైపు బీఆర్ఎస్ సభ్యులు దూసుకెళ్లారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు వాటర్ బాటిల్స్, పేపర్లు విసురుకున్నారు. ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. దాంతో సభను 15 నిమిషాల పాటు అసెంబ్లీ స్పీకర్ వాయిదా వేశారు. స్పీకర్‌పై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేపర్ల కట్ట విసిరారని కాంగ్రెస్ సభ్యులు అంటున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా పేపర్లు చింపి విసిరేశారు. స్పీకర్ పోడియం మెట్లపైకి హరీష్‌రావు వెళ్లారు. పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేల వైనపుకు దూసుకురావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేయి చూపించి హెచ్చరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దళిత స్పీకర్‌ను అవమానించేలా సభలో వ్యవహరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీలో ఒక్క మంత్రి కూడా ఎందుకు లేరు: హరీష్‌రావు**

ఈ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. సభలో ఒక్క మంత్రి కూడా ఎందుకు లేరని ప్రశ్నించారు. అసెంబ్లీ అంటే మంత్రులకు ఎంత గౌరవం ఉందో అర్థం అవుతుందని అన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌పై చర్చకు స్పష్టమైన హామీ ఇస్తేనే తాము సభ సాఫీగా జరగడానికి సహకరిస్తామని అన్నారు. ఒక సభ్యునిపై కేసు పెట్టారని.. సభ నడుస్తున్నప్పుడు ఆ సభ్యునికి వాస్తవం చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. కేటీఆర్‌పై పెట్టింది ముమ్మాటికీ అక్రమ కేసే అని హరీష్‌రావు అన్నారు.

**సభా సమయాన్ని వృథా చేయడం సరికాదు: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్**

హరీష్‌రావు వ్యాఖ్యలపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడారు. కొందరు మంత్రులు శాసనమండలిలో ఉన్నారని చెప్పారు. భూభారతి బిల్లుపై చర్చ పూర్తి కానివ్వాలని అన్నారు. బిల్లుపై చర్చ పూర్తయిన తర్వాత సభ్యులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒక సభ్యుని కోసం సభా సమయాన్ని వృథా చేయడం సరికాదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు.

**ఈ కార్ రేసింగ్ శాసనసభలో చర్చించే అంశమే కాదు: ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

ఈ కార్ రేసింగ్ శాసనసభలో చర్చించే అంశమే కాదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గవర్నర్ ఆమోదం తెలిపి ఏసీబీ కేసు కూడా నమోదు చేసిందని గుర్తుచేశారు.

## ఎండనకా.. వాననకా గిరి పుత్రుల కోసం పని చేస్తా..

- మూడు దశల్లో ఏజెన్సీ ప్రాంతాల రోడ్ల అభివృద్ధి
- పర్యాటకంగా మన్యం ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక
- యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాము
- గిరిజనుల వెతలు స్వయంగా తెలుసుకొనేందుకే కొండపైకి నడిచి వెళ్ళాను
- గత ప్రభుత్వంలో గిరిజనుల కోసం ఒక్క పని చేసింది లేదు
- రూ.500 కోట్లతో ఋషికొండ ప్యాలెస్ కట్టారుగానీ గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు కూడా వేయలేదు
- అప్పులు, తాకట్టులతో ప్రజాధనం వృథా చేశారు
- గిరిజన ప్రాంతాల్లో ప్రతి రెండు నెలలకోసారి పర్యటన చేపడతాను
- సాలూరు నియోజకవర్గంలో బాగుజోల - సిరివర రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం గిరిజనులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్





**సాలూరు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అయినా ఇప్పటికీ గిరిజన ప్రాంతాల్లో సరైన రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో సకాలంలో వైద్య సదుపాయం అందక అడవి బిడ్డలు మృత్యువాత పడడం కలిచివేసే విషయం. గిరిజనుల ప్రాణాలన్నా, వారి సంక్షేమమన్నా గత పాలకులకు ఎందుకో నిర్లక్ష్యం ఆవహించింది. గత ఐదేళ్ల పాలనలో గిరిజన అభివృద్ధికి దృష్టి పెట్టింది లేదు. రుషికొండ ప్యాలస్ ను రూ. 500 కోట్లతో నిర్మించడం, వెనకబడిన జిల్లాలకు చెందాల్సిన నిధులను పక్కదారి పట్టించడం తప్పితే ఇక్కడ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించార'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ నిరక్ష్యరాస్యత, పేదరికం, ఆకలికేకలు, అనారోగ్యం వంటి అంశాలు పట్టిపీడుస్తున్నాయన్నారు. ప్రజలకు ఎంతో బాధ్యతగా కొత్త మార్పు కోసం సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి కచ్చితంగా పర్యటించి క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్యలు తెలుసుకుంటానని స్పష్టం చేశారు. సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం బాగుజోల నుంచి సిరివర గ్రామం వరకు రూ. 9 కోట్లతో తారు రోడ్డు నిర్మించే పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ ఉపాధి హామీ నిధులతో ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించబోయే రోడ్లకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. శంకుస్థాపన చేసిన ప్రదేశం నుంచి సిరివర వెళ్ళే కొండప్రాంతం మీదకు ఉన్న కచ్చా రోడ్డును పరిశీలించేందుకు కాలినడకన వెళ్లారు. స్వయంగా గిరిజన నివాస ప్రాంతాలకు వెళ్ళి వారితో మాట్లాడారు. అనంతరం బాగుజోలకు వచ్చి గిరిజనులతో మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మనసుంటే మార్గం ఉంటుంది. అడవి, కొండలను నమ్ముకొని జీవించే గిరిపుత్రుల కష్టాలు తీర్చాలనే ఆలోచన ఉంటే కచ్చితంగా ఏదో ఒక మార్గం కనిపిస్తుంది. గత ప్రభుత్వం ఏనాడు గిరిజనుల అభ్యున్నతి, అభివృద్ధిపై దృష్టి పెట్టింది లేదు. విశాఖపట్నంలో విలువైన ఆస్తులను తాకట్టు పెట్టి వేల కోట్లు అప్పులు

- 7లో

## పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

- పోలీస్, న్యాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- ఫాస్ట్ ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయ, హెూం మంత్రుల సమీక్ష




**అమరావతి,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరు పై ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, అనిత మాట్లాడారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశ్యంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేటట్లుగా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టులు మరింత వేగంగా పనిచేయాలని సూచించడం జరిగింది. సమీక్ష సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి, హెూం శాఖ కార్యదర్శి తదితర ముఖ్యమైన అధికార బృందం పాల్గొన్నారు.

**23న విజయవాడలో క్రిస్మస్ తేనేటి విందు..** విజయవాడలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన ప్రభుత్వం తేనేటి విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తేనేటి విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తేనేటి విందు కార్యక్రమానికి క్రైస్తవ కుటుంబ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు

## నేడు మనం ఇంధన పొదుపు చేయకపోతే భవిష్యత్ తరాలకు అంధకారమే

- ఈ ఏడాది ఇందన పొదుపులో మన రాష్ట్రానిదే ప్రథమ స్థానం
- ఒక యూనిట్ ఆదా చేస్తే ఒక యూనిట్ ఉత్పత్తి చేసినట్లే
- సోలార్ పరికరాల వినియోగం పెరగాలి
- విజన్-2047లో భాగంగా రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు
- విద్యుత్ పరికరాల వినియోగంలో నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తే విద్యుత్ ఆదా చేయగలం
- విద్యుత్ ఆదా మన దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి.
- ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె విజయానంద్





**విజయవాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ఇంధన పొదుపు మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని లేకపోతే భవిష్యత్ తరాలకు అంధకారమేనని ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడ పట్టణంలోని ఓ హెూటల్ లో శుక్రవారం రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డు గ్రహీతలకు అవార్డుల ప్రధానోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎనర్జీ శాఖ జాయింట్ సెక్రటరీ,

- 7లో

## నూజివీడు ఏరియా ఆసుపత్రిని నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా

- ఏరియా ఆసుపత్రిలో సిటి స్కాన్ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు అందిస్తా
- అత్యవసర చికిత్స కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు
- ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయకుండా ఇక్కడే వైద్యమందించేలా వైద్యులు పనిచేయాలి
- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం పెంచేది వైద్య సిబ్బంది పనిచేయాలి
- కొత్త భవనాన్ని జనవరి,7వ తేదీన ప్రారంభిస్తా- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/నూజివీడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చే ఏ ఒక్క రోగి ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా నూజివీడు ఏరియా ఆసుపత్రిని ఏలూరు జిల్లాలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం పెంచేలా పనిచేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అత్యవసర చికిత్స కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రి కి వచ్చిన ఏ రోగి ని ఇతర ఆసుపత్రులకు పంపకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా సిబ్బంది పనిచేయాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రికి అవసరమైన సిటి స్కాన్ యంత్రాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తానని మంత్రి పార్థసారథి చెప్పారు. నూజివీడు నియోజవర్గ పరిధిలో విస్తృతంగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకువెళ్లాలన్నారు. వైద్య శిబిరాలలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ లో ఆసుపత్రిలో చేసిన చికిత్సలకు 2. 30 కోట్ల రూపాయలు ప్రోత్సాహకాలు కింద అందాయని, మరిన్ని చికిత్సలు చేసినట్లయితే, ఆ పథకం నుండి వచ్చే ప్రోత్సాహకాలతో ఆసుపత్రికి మరిన్ని వైద్య పరికరాలు, వసతులు కల్పించుకోవచ్చన్నారు. వచ్చే సంవత్సరం ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్సల ప్రోత్సాహకాల లక్ష్యాన్ని 6 కోట్ల రూపాయలుగా నిర్దేశించుకుని ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్సలు పెద్దఎత్తున చేయాలన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించి 7 నెలలు అయినప్పటికీ ఇంకా వినియోగంలోకి తీసుకురవకపోవడంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఫినిషింగ్ పనులు ఉన్నాయని ఈ నెలాఖరు నాటికి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలియజేయడంతో జనవరి, 7వ తేదీన వైద్య ఆరోగ్య శాఖామంత్రితో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా మంత్రి పార్థసారథి, సభ్యులుగా ఇళయరాజా, ఎం. వెంకట కామేష్, డా. ఝాన్సీరాణి, సబ్ కలెక్టర్ సమరం రాజ్, డా. నాదెండ్ల శ్రీకాంత్, గొల్ల దుర్గ దేవి, మెంబెర్ కన్వీనర్ గా డా. నరేంద్ర సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా. పాల్ సతీష్, ఏపి ఎం ఐ డిసి ఈ కె. నాగార్జున, డా. శ్రీనివాసరావు, మునిసిపల్ కమీషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, ప్రభృతులు పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ ఎన్నిక అధ్యక్ష కార్యదర్శులుగా ప్రకాష్, శ్రీనివాస్





**కాకినాడ రూరల్,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** అట్టహాసంగా కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక జరిగింది. క్లబ్బు అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయు లు ప్రకాష్, కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్లుగా శీలి లక్ష్మణరావు, సాగర సాక్షి నాని, కోశాధి కారిగా వార్త సత్యనారాయణ,జాయింట్ సెక్రటరీలుగా వల్లూరి రవికుమార్, గౌర వ సలహాదారుగా అర్జున్, భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. నూతన కమిటికీ సభ్యులు అభినందనలు తెలిపారు..


# 'పెనుగొండ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

● ఆత్మీయ శుభాకాంక్షలు



**గుంటూరు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దీపిక అభ్యుదయ 'వ్యాస సంపుటి'కి గాను ఆయన ఈ అవార్డు పొందారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న పెనుగొండ 1985-90 మధ్యకాలంలో గుంటూరులో విశాలాంధ్ర విలేకరిగా పనిచేస్తుండగా తాను ఆంధ్రపత్రికలో పనిచేస్తుండే వాడినని, నాటి నుంచి కూడా తనకు ఎంతో సాన్నిహిత్యం వుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ వారు తెలుగు సాహిత్యంలో చేసిన కృషికి గాను అజో-విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారం' లభించింది. గతంలో అధికార భాషా సంఘం వారి తెలుగు భాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం (2003) లభించాయి. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 2023లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా పెనుగొండ గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. ఆయన తొలి గ్రంథం "అనేక" 2004లో ప్రచురితం కాగా, విదిత 2014లో ప్రచురణయింది. దీపిక 2021లో ప్రచురించారు. దీపికలో పూర్తి సాధికారత కనిపిస్తుంది. 'దీపిక'లో దర్శించిన విషయాలపై వొరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు. "తొలి, మలితరం తెలుగు కథలు" సంకలనం గురించి దీపిక వివరంగా చర్చించింది. తప్పులకు రుజువులు చూపిస్తూ సరిచేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ' కథను హరితకాంశాల నేపథ్యంలో విశ్లేషించారు. గురజాడ సాహిత్యం - పర్గీకరణలు రాయలును యుగకర్త అనడములోని సాహిత్య కులము బయటపెట్టారు. "వైతాళికులు" సంకలనం వివాదంలో విస్మరణకు గురైన కవితా సంకలనం "కల్పన"ను పాఠకులకు పరిచయం చేశారు. పరిశోధకులకు ఈ దీపిక నిజంగానే కరదీపిక.

# శ్రీ తిరుపతమ్మ ను దర్శించుకున్న పలువురు న్యాయమూర్తులు



**పెనుగంచిప్రోలు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని ఎన్టీఆర్ జిల్లా నందిగామ అడిషనల్ డిస్టిక్ జడ్జి శ్రీనివాసరావు, సతీమణి వి.దీప్తి,జూనియర్ జడ్జి (ఆర్మూర్ ,నీజామాబాద్ జిల్లా )శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకోవడం జరిగినది. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలను ఆలయ ఏ.ఈ.ఓ. తిరుమలేశ్వర రావు,ఆలయ ప్రధాన అర్చకులు మర్రేబోయిన. గోపి ఆధ్వర్యంలో అందించడం జరిగినది.

# జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వారిని మర్యాదపూర్వకంగా కలిసిన నూజివీడు సబ్ కలెక్టర్..

● జిల్లా కలెక్టర్ వారికి పూలమొక్క అందజేసిన సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్..



**ఏలూరు/నూజివీడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** నూజివీడు సబ్ కలెక్టర్ గా నియమితులైన బచ్చు స్మరణ్ రాజ్ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వారిని శుక్రవారం నూజివీడు ట్రిపుల్ ఐటి లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వికి సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పూలమొక్కను అందజేశారు. ఈ సందర్బంగా శుక్రవారం విధుల్లో చేరిన సబ్ కలెక్టర్ కు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు. సివిల్స్ 676 ర్యాంక్ విజేత అయిన స్మరణ్ రాజ్ (2022 ఐఎఎస్ బ్యాచ్) చెన్నై ఐఐటిలో కెమికల్ ఇంజనీరింగ్(బిటెక్) పూర్తిచేశారు.

# త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడండి - ఎంపీపీ గరుడ ప్రసాద్



**కృత్తివెన్ను,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** శుక్రవారం నాడు స్థానిక కృత్తివెన్ను మండలం మండల పరిషత్ కార్యాలయం నందు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఎంపీపీ గరుడ ప్రసాద్ మాట్లాడుతూ రాబోవు కాలంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉంటుందని నీరు అందక రైతులు మండలవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటారని అందుచే అధికారులు అప్రమత్తమై నీటి ఎద్దులు లేకుండా చూడాలని సూచించారు. మండలంలో గల సర్పంచులు అందరూ సీసీ రోడ్ల నిర్మాణానికి చొరవ తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా సకాలంలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. గ్రామాలలో పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరిచేటట్లుగా కృషి చేయాలని మరియు డ్రైనేజీ పనులను చక్కదిద్దాలని కోరారు. మండలంలో గల మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది పనితీరు ఆశాజనకంగా ఉందని.. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో షుగర్ పేషెంట్లకు సంబంధించి ఇన్సులిన్ కొరత ఉందని దానిని అధిగమించే రీతిలో డి ఎం హెచ్ ఓ గాని లేదా పై అధికారుల దృష్టికిగానీ తీసుకువెళ్లి త్వరితగతిన రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మైలా రత్న కుమారి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మండల స్థాయిలో అధికారులు సిబ్బంది మరియు సర్పంచులుపాల్గొన్నారు.

# ఈ నెల 26 న 10 ద్విచక్ర వాహనాలకు వేలం పాట

**జి. కొండూరు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** స్థానిక జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో స్వాధీనపర్చుకున్న 10 ద్విచక్ర వాహనా లకు డిసెంబర్ 26వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ సతీష్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు జి.కొండూరు మండల తహశీల్దార్ అద్వర్యంలో ఈ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.ఆసక్తి కలిగిన వారు జి.కొండూరు పోలీస్ స్టేషన్ నందు 26వ తేదీ ఉదయం 9.00 గంటలకు జరిగే వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

# ఎంఎస్ఎంఈ లతో వాణిజ్య కేంద్రంగా మారనున్న కోనసీమ

● ఈ నెల 22న రామచంద్రపురంలో నిరుద్యోగులకు అవగాహన సదస్సు ● నిరుద్యోగులకు ఇదొక సువర్ణ అవకాశం

● ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం ● రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమలాపురం, డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** జీవితంలో స్వయం ఉపాధి ద్వారా ఉన్నతంగా స్థిరపడాలనుకునే నిరుద్యోగ యువతీ,యువకులకు ఇది ఒక శుభవార్త. మీరు పారిశ్రామిక వేత్త కావాలను కుంటున్నారా...మీ కాళ్ళపై మీరు నిలబడి స్వయం ఉపాధి దిశగా ఆలోచన చేస్తున్నారా..ఆలోచన ఉండి.. ఆచరణలో ముందు కెళ్లలేక పోతున్నారా...ఆర్థికంగా ఉండి.. ఎలా ముందుకు వెళ్లాలి అని ఆలోచిస్తున్నారా..భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడాలనుకుంటున్నారా.. అయితే ఈ సదవకాశం మీకోసమే. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి, స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగ యువతీ,యువకులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు స్వర్ణాంధ్ర సృష్టికర్త, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నడుం బిగించారు.కోనసీమ జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని,వాణిజ్య కేంద్రంగా (బిజినెస్ హబ్)గా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ప్రణాళికలు రూపొందించి అమలుకు సన్నద్ధం అయ్యారు. సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) ద్వారా నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలనే సదుద్దేశంతో ఈనెల 22 న ఉదయం 9 గంటలకు రామచంద్రపురం లోని వి ఎస్ ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో, కెరీర్ గైడెన్స్ అందించే అనుభవజ్ఞులైన నిపుణులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 1020 లాభసాటి (MSME ) ఎం ఎస్ ఎం ఈ స్కీములను గుర్తించి మీకు ఇష్టమైన సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు సహకరించేలా ఏర్పాట్లు చేశారు. పేపరు వర్క్ నుంచి.. బ్యాంకులో రుణం పొందే వరకు 10 టీములు మీకు సహకరిస్తాయి. స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంగా ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను అందించాలనే ఉన్నతాశయంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ (Speed of Doing Business in Konaseema) నినాదంతో ఏర్పాటుచేసిన ఈ అవగాహన సదస్సులో ఉత్సాహవంతులైన వారు పాల్గొని మీకు ఇష్టమైన పరిశ్రమను ఎన్నిక చేసుకుంటే వాటి కార్యాచరణ,అమలు, పరిశ్రమల స్థాపన జరిగే వరకు మంత్రి సుభాష్ ఏర్పాటు చేసిన 10 టీములు మీకు సహకరిస్తూ ముందుకు నడిపిస్తారు. ఈ సేవలన్నీ ఉచితంగానే అందిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు.ఈ గొప్ప అవకాశంను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఉత్సాహవంతులైన నిరుద్యోగులు, వితంతువులు వినియోగించు కోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోనసీమ ప్రజలను కోరారు.ఈ అవగాహన సదస్సు నిరుద్యోగులను యువతీ యువకులకు దిశా నిర్దేశం కాగలదని మంత్రి సుభాష్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఇప్పటికే 128 మంది వితంతువులు స్వయం ఉపాధి పొందేందుకు ముందుకు రాగా దానికి సంబంధించిన ప్రక్రియ చేస్తున్నామని మంత్రి సుభాష్ వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసి నిరుద్యోగ నిర్మూలన కృషి చేస్తున్నామన్నారు.

# సహజ ఇంధన వనరులు పొదుపుగా వాడుకోవాలి

● జిల్లాలో ప్రతి ఇంటిపైన, కార్యాలయాలపైన సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటుకు చర్యలు

● జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి వెల్లడి





**కాకినాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ఇంధనం వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమాల సందర్భంగా శుక్రవారం కాకినాడ కలెక్టరు కార్యాలయం వద్ద జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంధన పొదుపు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టరు షణ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు.తొలుత జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టరు.. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాలను కాకినాడ జిల్లాలో కూడా గత ఏడు రోజులుగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో ఇంధన పొదుపుపై వివిధ అవగాహన కార్యక్రమాలు,పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు సందర్భంగా ఇంధనం వనరులు భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించుకో వాలన్నారు. గృహ ఉపకరణాల్లో నిత్యం మనం వినియోగించే విద్యుత్తు పరికరాలు స్టార్ రేటింగ్ ఉన్నవే మాత్రమే వినియోగించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే గృహాల్లో ఉన్న ఏసీ, రీఫ్రిజిరేటర్లు ఇతర విద్యుత్తు పరికరాలు తక్కువ కరెంటు వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ప్రతి ఇళ్లు, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పైన సోలార్ ప్యానల్ ఉండేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరిగిందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకం కింద రాయితీపై సోలార్ ప్యానల్ అందిస్తుందన్నారన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇంటిపైన 100 చదరపు అడుగులు స్థలంలో ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.ఒక కీలో వాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.70 వేలు ఖర్చు అవుతుందని ఇందులో రూ.30 వేలు ప్రభుత్వం రాయితీస్తుం దన్నారు. సగటున నెలకు రూ.1000 కరెంటు బిల్లు వచ్చే గృహానికి ఒక కీలో వాట్ సోలార్ ప్యానల్ ద్వారా రూ.330లు మాత్రమే కరెంటు బిల్లు వస్తుదన్నారు.ఈ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంవత్సరానికి సుమారుగా రూ.8వేలు ఆదా చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాలో ప్రతి ఇల్లు ప్రతి ప్రభుత్వ కార్యాలయం పైన సోలార్ ప్యానల్ ఏర్పాటును ఒక ఉద్యమంలా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టరు తెలిపారు.ఇందుకు అనుగుణంగా గ్రామాల వారిగా సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసే ఏజెన్సీలను గుర్తించడం జరిగిందని జిల్లా కలెక్టరు అన్నారు. ఇంధన పొదుపుపై నిర్వహించిన అవగాహన ర్యాలీ కలెక్టరేట్ ఆవరణంలో ప్రారంభమై జిల్లా పరిషత్ జంక్షన్, జీజీహెచ్ రోడ్డు మీదుగా బాలాజీ చెరువు వరకు సాగింది. "నేటి సత్సంకల్పం-రేపటి వెలుగుల సహకారం"బీ "కరెంటు ఆదా చేద్దాం - భవిష్యత్ తరాలకు భరోసానిద్దాం".. అంటూ సీబీఎం కళాశాల విద్యార్థులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నినాదలతో ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి. ప్రసాద్, కాకినాడ పెద్దాపురం జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎన్ .ఉదయ్ భాస్కర్,ఎ.ప్రభాకర్, వీరభద్రరావు, ఏడీఈలు, ఎఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కానుమోలు ఆయుర్వేద వైద్యశాల కు లక్ష రూపాయలు విరాళం అందించిన సుంకర సుభాష్ చంద్రబోస్



**హనుమాన్ జంక్షన్,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** బాపులపాడు కానుమోలు గ్రామం లో ఉన్న ఆయుర్వేద వైద్యశాల అభివృద్ధికి బాపులపాడు జెడ్ పి టి సి మాజీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్ లక్ష రూపాయలు విరాళం అందించారు. పురాతన కాలంలోని ఈ ఆయుర్వేద వైద్యశాలను డాక్టర్ వాహిని వచ్చిన తరువాత వినూత్నంగా అభివృద్ధి చేశారు. డాక్టర్ చేస్తున్న అభివృద్ధికి తన వంతు విరాళంగా సుంకర సుభాష్ చంద్రబోస్, నాగమణి దంపతులు 50, 000 వేల రూపాయలు విరాళం ముందుగా అందించారు. 50,000 అందించటమే కాకుండా తనకు తెలిసిన మిత్రులు బిళ్ళనపల్లి కి చెందిన దేవినేని కిషోర్ 10,000 వేల రూపాయలు, కానుమోలు కు చెందిన నరహరశెట్టి గంగాధరరావు 10,000 వేల రూపాయలు, సీతారాంపురం కు చెందిన లింగమనేని కిషోర్ 10,000 వేల రూపాయలు, విజయవాడ కు చెందిన సరిపల్లి సింధు జ్యోతి 10,000 వేల రూపాయలు, నూజివీడు కు చెందిన రాజేష్ ద్వారా 10,000 వేల రూపాయలు మొత్తం లక్ష రూపాయలు ఆయుర్వేద వైద్యశాల కు అందించారు. ఈ కార్యక్రమంలో కానుమోలు మాజీ సర్పంచ్ లు చింతల వెంకట శివ అప్పారావు, దన్నే దుర్గారావు, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ గ్లోబల్ ప్రెసిడెంట్ తాడి రంగారావు తదితరులు పాల్గొని దాత సుంకర సుభాష్ చంద్రబోస్ దంపతులను అభినందించారు.

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డా యనమదల రమేష్



**హనుమాన్ జంక్షన్/నూజివీడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** మంత్రి కొలుసు పార్థసారధి సౌజన్యంలో ఈ రోజు నూజివీడు గిఫ్ఫోర్డ్ వెమోరియల్ హాస్పిటల్ వారిచే నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరంను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు యనమదల రమేష్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ ప్రసంగి పెదపూడి, మెటాస్ సంస్థల కంపెనీ సెక్రటరీ మనోజ్ కుమార్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, చిన్నపిల్ల వైద్య నిపుణులు డాక్టర్ యనమదల సుధీర్ కుమార్ చౌదరి, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్నం దీప్తి, కంటి వైద్యులు కె. ప్రభుదాసులు పాల్గొని వైద్య సేవలు అందించారు. నూజివీడు మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి చెన్న రాఘవేంద్ర నాథ్ మరియు మంత్రి సారధి పర్సనల్ అసిస్టెంట్ రమేష్ ఈ శిబిరాన్ని సందర్శించి తగు సూచనలు ఇచ్చారు. హాస్పిటల్ వారిచే అవసరమైన వారికి ఉచితముగా రక్తపరీక్షలు చేసి మందులు అందించారు. స్థానిక సచివాలయ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు యనమదల వాసు, దావులూరి కృష్ణమోహన్ యనమదల సత్యనారాయణ (సిద్ధయ్య )బెజవాడ శ్రీనివాసరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

# ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి - సిపిఎం ధర్నా




**ఆగిరిపల్లి,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలం, నెక్కలం గొల్లగూడెంలో సిపిఎం పార్టీ అధ్వర్యంలో స్థానిక సుందరయ్యనగర్ లో విద్యుత్ స్మాట్ మీటర్లు బిగించవద్దని ,ప్రజలపై మోపిన ట్రూ ఆఫ్ ఛార్జ్ లను తగ్గించాలని, అనంతరం కరెంటుబిల్లులను దగ్ధము చెస్తూ నిరసన కార్యక్రమము చెయ్యటం జరిగింది ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కన్వీనర్ సిహెచ్ శివనాగరాజు, మండలకమిటి సభ్యుడు ముత్యాల నరేశ్, ఎం.కృష ,టి .గురవయ్య ,టి .కుమారి ,వెంకటేశ్వరమ్మ ,తిరుపతమ్మ ,సూరమ్మ ,కొటేశ్వరావు , నవీన్, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ లో తనిష్క్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభం




**కాకినాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** భారత దేశపు అతిపెద్ద జ్యువెలరీ తనిష్క్ కాకినాడలో భారీ స్టోర్ ను సౌత్ రీజినల్ బిజినెస్ హెడ్ అజయ్ ద్వివేది శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కువ మంది అభిమానించే జ్యువెలరీ బ్రాండ్ గా పేరందిన తనిష్క్ స్టోర్ ను కాకినాడలో పునః ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ స్టోర్ నందు అద్భుతమైన బంగారం డైమండ్స్ ఆవరణలో ప్రదర్శన ఉత్కంఠ భరితమైన సాలి టైర్లు శక్తివంతమైన రత్నాలు ప్రత్యేకమైన పండుగ కలెక్షన్లు ప్రతి విధమైన డైమండ్ విడిభాగాలు ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా బ్రాండ్ వదులుకోలేనట్టి ఆఫర్ ను అందిస్తోందని, ఇందులో ప్రతి కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం పొందవచ్చు ఈ ఆఫర్ డిసెంబర్ 20 నుండి 22 వరకు ఉంటుందన్నారు. దాదాపు 6750 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ స్టోర్ అబ్బురపరిచే సాదా బంగారం,అద్భుతమైన వజ్రాలు,కుందన్ పోల్కి వంటి ప్రతిష్టాత్మక తనిష్క్ ఆభరణాల డిజైన్ల యొక్క విస్తృతమైన ఎంపికను అందిస్తుంది.ఈ స్టోర్ సగర్వంగా తనిష్క్ ఇటీవల విడుదల చేసిన వివా ఎక్స్ తరుణ్ తహిలాని రెండవ ఎడిషన్ కలెక్షన్ను ప్రదర్శిస్తుంది.ఇది రెండు థీమ్ ల ద్వారా ప్రేరణ పొందింది. ఫూల్ చాదర్ ,డ్రేప్ స్టోర్ లో అలాగే దేవతా రూపాలచే పండుగ కలెక్షన్ ఆర్నా కూడా అందుబాటులో ఉంటుంది.ఆధునిక , తేలికపాటి ఆభరణాల శ్రేణి స్ట్రింగ్ ఇట్ కూడా లభిస్తాయి.ఇంకా హిందూ వివాహానికి సంబంధించిన పవిత్ర అంశాల నుండి ప్రేరణ పొందిందిన డోర్ అనే ప్రత్యేకమైన మంగళసూత్రాలు అందుబాటులో ఉన్నాయి.పురుషుల కోసం ప్రత్యేకమైన ఆభరణాలు అందిస్తుంది. తనిష్క్ యొక్క అంకితమైన వివాహ ఆభరణాల సబ్ బ్రాండ్ అయినా రేవా నుండి అద్భుతమైన ఆభరణాలతో పాటు ఆవీర్ ను, భారతదేశం అంతటా వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఫ్యాషన్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రివా సూక్ష్మంగా రూపొందించబడింది, వివాహ షాపింగ్ కోసం ఏకీకృత కేంద్రంగా అభివృద్ధి చెందింది.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# నడికూడ రఘునాథ్ యాదవ్ ను ఘనంగా సన్మానించిన ధన్వంతరి వైద్యుల బృందం

● మీ సేవలకు తోడు... మేము సైతం

● ధన్వంతరి వైద్యుల సంఘం అధ్యక్షుడు జి రాజు




**షాద్ నగర్,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ సేవా రత్న అవార్డు గ్రహీతను ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జి.రాజు ఆధ్వర్యంలో నడికూడ రఘునాథ్ యాదవ్ ను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జి.రాజు మాట్లాడుతూ సమాజంలో ఎంతో కొంత మనం సంపాదించిన దాంట్లో సాయం చేయడంలోనే నిజమైన మానవత్వం కలిగి ఉంటుందని, మేము చేసే వైద్య సేవలను, నడికుడ రఘునాథ్ యాదవ్ చేస్తున్న సమాజ సేవకు తోడ్పాటున అందిస్తామని, వారు వేసే ప్రతి అడుగులకు మా యొక్క సహాయ సహకారాలు కల్పిస్తామని, ఇంతటి గొప్ప సేవా పురస్కారాన్ని అందుకోవడం నిజంగా షాద్ నగర్ వాసులుగా మేము గర్వపడుతున్నామని అన్నారు. మీరు మునుముందు బీద, మధ్యతరగతి కుటుంబాలకు సేవలందిస్తూ మరెన్నో అత్యున్నత పురస్కారాలు అందుకోవాలని కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.బాలకృష్ణ, జి రాజు,మహేందర్, కుమ్మరి శ్రీను, రామస్వామి, యాదగిరి, బాల్ రెడ్డి తదితర వైద్యులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

## అన్యాయం జరిగిన కార్మికులకు అండగా నిలుస్తున్న -బిఆర్ టీయు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్..



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియా లో "ఉట్ర ఫ్యాన్ కంపెనీ" సుభాష్ నగర్ లో నరేష్ హెల్పర్ గ గత కొన్ని సంవత్సరల నుంచి కంపెనీలో పని చేసేవాడు... కంపెనీ యజమాన్యం నరేష్ అనే హెల్పర్ కు ఆరు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో డ్యూటీ మానేయడం జరిగింది... మొత్తం ఆరు నెలల వేతనం 60,000/– వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగిన యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవ దంతో విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా తనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టీయు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యొక్క యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడు నరేష్ కు రావాల్సిన ఆరు నెలల వేత్తనం మొత్తం 60,000/– వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... కార్మికుడు నరేష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో కూడా కార్మికులకు న్యాయం చేయడంలో ముందుండి ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి కార్మికునికి న్యాయం చేస్తున్న రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలి

సిఐటియు దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె .లింగస్వామి



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 20 (వార్తాప్రభ)** : పార్లమెంట్లో అత్యంత దారుణంగా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కొంపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది అదేవిధంగా అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి మాట్లాడుతూ ప్రపంచ మేధావి అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితమంతా ఈ దేశం కోసం అంకితం చేసిన భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కించపరిచే విధంగా పార్లమెంట్లో కేంద్ర హోం శాఖ మంత్రి మాట్లాడడం అత్యంత దారుణమని, తక్షణమే అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి అమీషాపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం కావాలని భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం కుట్ర చేస్తున్నారని అంబేద్కర్ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియకుండా ఉండాలని కుట్ర చేస్తున్నారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాల నుండి ప్రజలను పక్కదారి మళ్ళించడం కోసం బిజెపి ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం మీద ధరల మీద సమాధానం చెప్పలేని కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛినం చేయడం కోసం మతకల్లోలాలు సృష్టించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వాక్యాలను ఖండిస్తూ దేశ ప్రజలందరూ ఉద్యమాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యం, లక్ష్మయ్య, శ్రీను, దుర్గేష్, రాజు, స్వామి, పరశురాములు, యాదగిరి, అమృత బాలమణి, వసంత యాదమ్మ, శాంతి, ఎల్లమ్మ, మంజుల, స్వరూప, లలిత తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ డివిజన్లో నీటి ఎద్దడిని నివారించాలి

ఖైరతాబాద్ జలమండలి ఎండి అశోక్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి :డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మంచినీటి ఎద్దడి నివారించాలని కోరుతూ ఖైరతాబాద్ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని మల్కాజ్గిరి శాసనసభ్యులు మరి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీ నరసింహ స్వామి నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, బిహారి బస్తి తదితర ప్రాంతాలలో మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నుండి 2 ఎం.ఎల్ నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి నీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రామ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ డివిజనుగా తీర్చిదిద్దుతున్నాం!!

● ఒక్కటి ఒక్కటిగా సమస్యలు పరిష్కరిస్తున్నాం ● మౌలిక వసతుల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం ● నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయం ● 11వ డివిజన్ కార్పోరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్



**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 20 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ 11వ డివిజనును ఆదర్శ డివిజనుగా తీర్చిదిద్దుతున్నామని హర్షం వ్యక్తం చేశారు ఆ డివిజన్ కార్పోరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు కార్పోరేటర్. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ...... డివిజనులో నెలకొన్న సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తూ పాలన ముందుకు సాగిస్తున్నమని అన్నారు. మౌలిక వసతుల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని తెలిపారు. నియోజకవర్గ, నగరపాలక డివిజన్ల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సహకారం అభినందనీయం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాయపోషం, ఓదెలు, దుర్గయ్య, రాజయ్య, సారమ్మ, దుర్గమ్మ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ 6 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

● జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ



**తొర్రూర్ డిసెంబర్ 20(వార్తా ప్రభ)**డిసెంబర్ 28, 29,30 తేదీలలో నల్లగొండలో జరుగు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమము శుక్రవారం తొర్రూరు ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ఉపాధ్యక్షులు చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు మురళి కృష్ణ హాజరై మాట్లాడుతూ ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగ పరిస్థితిలు, విద్యారంగ బలోపేతం, విద్యారంగ ఉపాధ్యాయ రంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ మాసభలకు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , రోడ్ల భవనముల శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ,తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి , పాఠశాల విద్యా డైరెక్టర్ ఈ వి నరసింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి కొండ నాగ మల్లయ్య మాట్లాడుతూ సీపీఎస్ రద్దుపరిచి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, 317 జీవోలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ,కేజీబీవీ ఉపాధ్యాయులు మరియు ఎస్ ఎస్ ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి మినిమం బేసిక్ పే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈ రమేష్,యాకెందర్, రాయలు, నారాయణ, పార్వతి, రంజిత్ ,జనార్ధన్, మహేందర్ ,మౌనిక, మమత, పల్లవి,యాకూబ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేస్తే సహించేది లేదు - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన ప్రజల తాగు నీటి కోసం 2017 లో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎలాంటి సమాచారం అందించకుండా కాంట్రాక్టర్ కూలగొట్టిన తీరును మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ తీవ్రంగా ఖండించారు. అనంతరం కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిత తనిఖీ చేసి విద్యార్థులకు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హెడ్మాస్టర్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపెల్లి గ్రామ మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి , ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ కావాలి గోపాల్, పూర్ణచంద్రరావు, అశోక్ రెడ్డి, దశరథ్, ఆంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, ఖదీర్, నవీన్ ముదిరాజ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీసస్ అనుగ్రహం ప్రజలపై ఉండాలి.

-క్రిస్మస్ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ ప్రత్యేక ప్రార్ధనలు



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 20 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ లోగల సురభి కాలనీ ఎంపిపిఎస్ పాఠశాల,ఆరంభ టౌన్షిప్ లలో క్రైస్తవ సోదరుల క్రిస్మస్ పండగను పురస్కరించుకుని నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిధులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్ ని శాలువా కప్పి బోకే ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..క్రిస్టియన్ సోదర,సోదరీమణులకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు.శాంతి, మానవత్వం కోసం ఏసుక్రీస్తు చెప్పిన బోధనలు ప్రతిఒక్కరూ ఆచరించాలని అన్నారు. జీసస్ ఆశీర్వాదం ప్రతిఒక్కరిపై ఉండాలని,డివిజన్ మరియు రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు.దైవజనులు మాట్లాడుతూ..శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పై జీసస్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని,వారి కోసం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ సందేశాన్ని దైవజనులు వినిపించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ శ్రీకళ,సందయ్య నగర్ ప్రెసిడెంట్ బస్వరాజ్,ఆరంభ టౌన్షిప్ ప్రెసిడెంట్ రవీంద్ర రాథోడ్,దీప,ఆరంభ టౌన్షిప్ క్రిస్టియన్ అసోసియేషన్ పాస్టర్ సువర్ణ రాజ్,పాస్టర్ డానియల్,పాస్టర్ జాషువా, పాస్టర్ అనురాగ్,కుటుంబరావు,రాజేష్, మధుసుధన్ రెడ్డి,అరుణ, అశ్రఫ్,షఫీ,నర్సింలు,పాస్టర్ రాజ్ కుమార్ నాగేశ్వరరావు, సుధారాణి,సబియా,మాధవి, రాజ్ కుమార్,వెంకటమ్మ, జోష్ణ,సుమన్,తిమోతి, కిషోర్,కుమార్,కిషోర్, బాలరాజ్,డానియల్, గురుప్రసాద్,నరేష్,సరోజ సిస్టర్,సుజాత సిస్టర్,జెస్సిక సిస్టర్,ఆంజనేయులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## సందర్శకులను ఆకట్టుకున్న చేనేత హస్తకళ ఉత్పత్తులు





**శేరిలింగంపల్లి,డిసెంబర్ 20 (వార్తాప్రభ)**:మాదాపూర్ లోని శిల్పారామం లో అల్ ఇండియా క్రాఫ్ట్ మేళ సందర్భంగా భారతదేశం లోని వివిధ రాష్ట్రాలకి చెందిన చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవి.సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పర్ణిక మాన్య తన శిష్య బృందం చే సంగీత స్వర జారీ అందించారు.అట్లాంటా – జార్జియా నుండి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి పుష్యమి లంక తన ప్రదర్శనలో భాగంగా ఆనంద తాండవం ఆడే,స్వాగతం కృష్ణ అంశాలను ప్రదర్శించారు.భరతనాట్య ప్రదర్శనలో భాగంగా నారాయణి నాట్యాలాయ సంతోష్ కుమార్ తమంగ్ శిష్య బృందం పుష్పాంజలి,నటేశ కౌతం,శబ్దం,కీర్తన,తుంగ తరంగ గంగే,నట్హనం అదినార్,క్షేత్రీయ పదం,తిల్లాన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

## మద్యం తాగి.. బండి నడుపుతూ.. పట్టుబడ్డాడు!!

కోర్టులో హాజరు పరిచిన ట్రాఫిక్ పోలీసులు

సమాజసేవ చేయాలని తీర్పునిచ్చిన న్యాయమూర్తి



**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)**మద్యం తాగి.. బండి నడుపుతూ.. పట్టుబడిందు జి. ప్రభుదాస్. తనిఖీలో భాగంగా చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవులో చిక్కిన ప్రభుదాసును రామగుండం ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ కోర్టులో హాజరు పరిచారు. ఇంకేముంది న్యాయమూర్తి వెంకటేష్ శిక్షార్హుడికి ఒకరోజు సమాజసేవ చేయాలని తీర్పునిచ్చినారు. ఈ మేరకు గోదావరిఖని రామగుండం నగరపాలక సంస్థ సిగ్నల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియమాలను తెలిపే సమాజ సేవ చేశారు. ఈ అంశాన్ని ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్ హరి శేఖర్ పర్యవేక్షించారు.

## విద్యార్థి నిరుద్యోగ జేఏసీ నుండి వెలిశాల శ్యామ్ తొలిగింపు

-రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు



**తొర్రూర్ డిసెంబర్20 (వార్తా ప్రభ)** మహబూబా జిల్లా లోని విద్యార్థి నిరుఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న వెలిశాల శ్యామ్ ను సంఘం నుంచి తొలిగిస్తున్నట్లు తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జె ఏసీ రాష్ట్ర చైర్మన్ మానవతా రాయ్ ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు జిల్లా చైర్మన్ పంతం విజయేందర్ పత్రిక ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం కార్యకలాపాల లో పాల్గొనకుండా ఇష్టానుసారంగా వివరిస్తూ ఉండడంతో రాష్ట్ర కమిటీ తొలగించమని ఉత్తర్వులు జారీ చేయడంతో తొలగిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుకొండ సురేష్,నరేష్, వెంకన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్మి పండుగ సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీష్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు






**శేరిలింగంపల్లిడిసెంబర్ 20 (వార్తాప్రభ)**:గ్యార్మి పండుగ పురస్కరించుకుని అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈద్గా నందు నిర్వహించిన ఉత్సవాల్లో స్థానిక శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్,కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్,శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నదానం నిర్వహించారు.ప్రతి సంవత్సరం ఒకరి ఇంటి వద్ద నుండి సందల్ ఊరేగింపుతో దర్గా వద్దకు చేరుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుండి జెండా దర్గా వద్దకు తీసుకువచ్చి దర్గా వద్ద నిలుపుతారు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కూన సత్యం గౌడ్,కావూరి ప్రసాద్,వాసు,నవీన్ రెడ్డి,లక్ష్మీనారాయణ ,నవాజ్,కైజర్,సయ్యద్,రెహ్మాన్,సుల్తాన్, అబ్దుల్,కలీల్,అలహాబాక్ష్,ముస్తఫా ,షఫీ,సోయల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో వర్కర్స్ అక్రమ అరెస్టులను ఖండించండి

**నారాయణపేట డిసెంబర్ 20 (వార్తాప్రభ)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన ఆటో వర్కర్స్ లను వెంటనే విడుదల చెయ్యాలని కార్మిక సంఘం నాయకులు, సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కే కాశీనాథ్ డిమాండ్ చేశారుకాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు సంవత్సరానికి 12000/–జీవన భృతి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అధికారం వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన తర్వాత చాలామంది మహిళలు ఆటోలు ఎక్కకుండా బసు ప్రయాణం చేస్తున్నారు.

# ఎడిటోరియల్

## కాంగ్రెస్ తో జగన్ కి పెద్ద పని పడిందా ?

జగన్ కాంగ్రెస్ లోనే పుట్టి పెరిగారు. ఆయన ఇంట్లో ఒంట్లో కూడా కాంగ్రెస్ రక్తం ఉంది. అపుడెపుడో చంద్రబాబు ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో మాట్లాడుతూ తన రక్తంలో ముప్పయి శాతం కాంగ్రెస్ బ్లడ్ ఉందని చెప్పినట్లుగా ప్రచారంలో ఉంది. మరి జగన్ రక్తంలో కాంగ్రెస్ బ్లడ్ ఎంత అంటే చాలానే అని చెప్పాలి. జగన్ 2009లో కాంగ్రెస్ ఎంపీ కావచ్చు. కానీ ఆయన అనేక ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారు. ముఖ్యంగా తన తండ్రి వైఎస్సార్ గెలుపు కోసం సొంత జిల్లాలో తిరిగారు. ఇక జగన్ కి కాంగ్రెస్ తో మరో విచిత్ర బంధం ఏంటి అంటే కాంగ్రెస్ ని ధిక్కరించే ఆయన పెద్ద లీడర్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ ఆయనను పదహారు నెలలు జైలులో పెట్టించడం వల్లనే ఆయన వైసీపీని స్టార్ట్ చేసి ఏపీలో తిరుగులేని లీడర్ గా ఎస్టాబ్లిష్ అయ్యారు. అలా కాంగ్రెస్ తెలిసీ తెలియకో జగన్ కి బాగానే హెల్ప్ చేసింది అన్నది ఒక విశ్లేషణగా చూడాల్సి ఉంది. ఇక జగన్ వైసీపీలో నూటికి ఎనభై మంది కాంగ్రెస్ వారే చేరి కొత్త పార్టీని సత్తువ కలిగిన పార్టీగా మార్చారు. అలాగే కాంగ్రెస్ ఓటు బ్యాంక్ మొత్తాన్ని జగన్ సొంతం చేసుకుని దశాబ్దాల టీడీపీని ఢీ కొట్టే స్థాయికి ఎదిగారు. ఇవన్నీ ఫ్లాష్ బ్యాక్ కథలే అయితే ఇపుడు మరోసారి జగన్ కి కాంగ్రెస్ తో పెద్ద పని పడింది అని అంటున్నారు. అదెలా అంటే 2011లో ప్రారంభించిన వైసీపీలో అత్యధిక శాతం కాంగ్రెస్ నేతలు ఉంటే ఆ మిగిలిన శాతం టీడీపీ సహా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు. ఇపుడు చూస్తే 2024 లో ఘోర ఓటమి తరువాత వైసీపీ పునాదుల నుంచి ఉన్న వారు కూడా పార్టీని వదిలేసి బయటకు పోతున్నారు. ఇక వైసీపీలో చేరిన ఇతర పార్టీల నేతల సంగతి సరేసరి. వారంతా కూడా వైసీపీ ఫిలాసఫీ నచ్చి చేరలేదు. వారికి కాంగ్రెస్ వాసనలు కూడా లేవు. దాంతో చాలా సులువుగా ఫ్యాన్ పార్టీని వదిలించేసుకుంటున్నారు. దీంతో వైసీపీ డీమోరలైజ్ అవుతోంది. ప్రతీ రోజూ మీడియాలో వస్తున్న వార్తలు అన్నీ వైసీపీకి షాక్ అంటూనే ఉన్నాయి. దానిని చూసి క్యాడర్ షాక్ తింటోంది.. మరి క్యాడర్ కి ఉత్సహం తెప్పించేలా వైసీపీ హై కమాండ్ ఏదైనా చేయాలీ అంటే పోయిన చోట వెతుక్కోవాలి. పార్టీని పటిష్టం చేసుకోవాలి. ఇప్పటికిపుడు టీడీపీ కూటమి నుంచి వచ్చే నేతలు ఎవరూ ఉండరు. అధికారం మరో నాలుగున్నరేళ్ల పాటు వారికి జాగ్రత్తగా ఉంటుంది. దాంతో అది అయ్యే పని కాదు. విపక్షంలో చూస్తే కామ్రేడ్స్ ఉన్నారు. వారిది సిద్ధాంత పోరాటం. అందువల్ల అక్కడ నుంచి ఎవరూ వచ్చే సమస్యే ఉండదు. మరి వైసీపీని బలోపేతం చేసుకోవాలీ అంటే ఏమి చేయాలి అన్నది చూస్తే కనుక కాంగ్రెస్ అన్న జవాబే వస్తుంది. ఏపీలో కాంగ్రెస్ కి ఒక్క శాతం ఓటు బ్యాంక్ ఉన్నా ఇంకా ఆ పార్టీని అట్టే బెట్టుకుని ఉన్న సీనియర్ నేతలు కనిపిస్తారు. వారంతా పార్టీ ఏనాటికి అయినా ఎదగకపోతుందా అని చూసి విసిగి ఉన్నారు. కాంగ్రెస్ పెద్దలు కూడా ఏపీ విషయంలో పెద్దగా ఫోకస్ పెట్టడం లేదు అన్న అసంతృప్తి కూడా ఉంది. ఇపుడు షర్మిలను తెచ్చి నాయకత్వ బాధ్యతలు ఇచ్చారు. కేంద్ర మంత్రులుగా చేసి కీలక శాఖలు చూస్తున్న వారు అంతా షర్మిల పోకడలతో దూరంగా ఉంటున్నారు అని ప్రచారంలో ఉంది. సరిగ్గా ఈ పాయింటే ఇపుడు వైసీపీ ఆశలను పెంచుతోంది. కాంగ్రెస్ మీద మరోసారి ఆపరేషన్ ఆకర్ష్ వల విసిరితే వైసీపీకి ఎన్నో రాజకీయ ప్రయోజనాలు చేకూరుతాయని ఆ పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. కాంగ్రెస్ లో ఉన్న సీనియర్ నేతలు అనుభవంలో దిట్టలు. జిల్లాలో కూడా ముఖ్యులు. సరైన పార్టీ, ఫ్లాట్ ఫారం దొరకాలే కానీ వారు మళ్లీ గేరు మారుస్తారు అన్నది కూడా ఉంది. అందుకే జగన్ రాయలసీమ మీదుగా కోస్తా గోదావరి ఉత్తరాంధ్రా జిల్లాలలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేతలను ఆకట్టుకునేందుకు యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పెట్టుకున్నారు అని అంటున్నారు. అలా చూస్తే అనంతపురానికి చెందిన మాజీ మంత్రి ఒకరు వైసీపీలో చేరుతారు అని అంటున్నారు. అదే విధంగా ఈ జిల్లా నుంచే మరో కీలక నేత కూడా ఫ్యాన్ నీడకు రావచ్చు అని అంటున్నారు. ఇక చిత్తూరు జిల్లాలోనూ మరో బడుగు బలహీన వర్గాలకు చెందిన నేత వైసీపీలో చేరే చాన్స్ ఉందని అంటున్నారు. గుంటూరు జిల్లాలో కూడా సీనియర్ నేతలు ఉన్నారని వారిని రప్పించాలని చూస్తున్నారు. గోదావరి జిల్లాలో ప్రముఖ నాయకులు కీలక సామాజిక వర్గాలకు చెందిన వారూ ఉన్నారు. వీరి విషయంలోనూ కదిపి చూడాలని అనుకుంటున్నట్లుగా భోగట్టా. అలా వైసీపీ అధినాయకత్వం తమ పార్టీ నుంచి బయటకు వస్తున్న సీనియర్ల కీలక నేతల స్థానంలో కాంగ్రెస్ నుంచి నేతలను తీసుకుని అలా పార్టీని పటిష్టం చేసుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. కొత్త ఏడాది ఈ ఆపరేషన్ ఆకర్ష్ మొదలవుతుంది అని అంటున్నారు.

## భూ వివాదాలు పరిష్కారమయ్యే వరకు రెవెన్యూ సదస్సులు

### ఈడుపుగల్లు రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని సత్యప్రసాద్



**కంకిపాడు: డిసెంబరు 20:(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు పరిష్కరించేంతవరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పిజిఆర్ ద్వారా అందుతున్న సమస్యల్లో 65 శాతం సమస్యలు భూ సంబంధ సమస్యలే ఉంటున్నాయని అన్నారు. శుక్రవారం నాడు క్రిష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాపాల ఫలితంగానే రాష్ట్రంలో భూ వివాదాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. వాటన్నింటనీ తమ కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. రీ సర్వే నిర్వహించడంలోనూ గత ప్రభుత్వం తప్పులు తడకగా వ్యవహరించిందని, అందువల్లే తాము రీ సర్వే నిర్వహించిన గ్రామల్లో సభలు పెడితే పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. తమ ప్రభుత్వం రీ సర్వేను మొదటి నుంచి చేస్తుందని, చాలా పకడ్బందీగా ఎటువంటి తప్పులకు తావు లేకుండా రీ సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పుల తోపాటు ఇతర భూ సంబంధ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మొదట 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరపాలనుకున్నామని, కానీ ప్రజల ఎదుర్కొంటున్న భూ వివాదాలన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించేంత వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల ఆరో తేదీ నుండి రెవెన్యూ సదస్సులను ప్రారంభించగా ఇప్పటికే నాలుగు లక్షల మంది ప్రజలు హాజరయ్యారని, లక్షకు పైగా ఫిర్యాదులు ఇచ్చారని తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు.

## ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించండి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ (ప్రతినిధి)** నగరంలోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బృందావన కాలనీ, ఆయుష్ హాస్పిటల్ పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలలో ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలని, అందుకు అనుగుణంగా స్థలాలను గుర్తించి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొకవల్, చీఫ్ సిటీ ప్లానర్ , జి వి జి ఎస్ వి ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్. బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం అభినందనీయం


- ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు
- తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ (ప్రతినిధి)**ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ఇమామ్, మౌజర్లకు సంక్షేమ పథకాన్ని కొనసాగించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంధర్బంగా ఎం.ఎస్.బేగ్ గత ఐదు సంవత్సరాల జగన్మోహన్ రెడ్డి పాలనలో సలాం, ఇబ్రహీం మరియు ఎందరో ముస్లిం మైనారిటీల మీద అనేకమార్లు వైసీపీ ప్రభుత్వం హత్యలు, దాడులు చేయించిందని అన్నారు. గత ప్రభుత్వంలో నిధులు లేని మైనారిటీ కార్పొరేషన్లు, చైర్మన్లు ఇచ్చి ముస్లిం మైనారిటీలను అపహాస్యం చేశారని అన్నారు. అలాగే యువగళంతో గళమెత్తిన యువనాయకుడు, మంత్రి నారా లోకేష్ ముస్లిం మైనారిటీలు పడుతున్న ఇబ్బందులు చూసి మీకు అండగా నేను ఉంటానని భరోసా కల్పించారని అన్నారు. ప్రతినెలా ఇమామ్‌లకు 10,000, మౌజాన్లకు 5,000 గౌరవవేతనాన్ని ప్రారంభించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి, కూటమి ప్రభుత్వనికి ముస్లిం మైనారిటీలు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. మన రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీ వర్గాలకు అండగా నిలబడడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. ఈ పథకం పట్ల నిబద్ధత కలిగిన ప్రభుత్వంగా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం మరియు అభ్యున్నతి పట్ల అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. కూటమి నాయకత్వంలో చంద్రబాబు నాయుడుకి వెన్నంటి నడిచిన ముస్లిం మైనారిటీలు ఎం.ఏ.షరీఫ్ ని ప్రభుత్వ మైనారిటీ సలహాదారులుగా, అబ్దుల్ అజీజ్ ని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ గా, మౌలానా ముస్తాక్ అహ్మద్ ని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ లుగా నియమించడం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలలో విశ్వాసం మరియు విశ్వాసాన్ని కలిగిస్తుందని బేగ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## పార్కుల ఆపరేషన్స్ అండ్ మెయింటైనాన్స్ పై సమీక్ష సమావేశం

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం నగరంలోని పార్క్ లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించేందుకు డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్క్స్ సమీక్ష సమావేశాన్ని సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాని అందించేందుకు నగరంలో ఉన్న పార్కులలో చేయవలసిన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి, మరి కొన్ని పార్కులలో ఆట పరికరాలను అమర్చే విధంగా చర్చించుకున్నారు, మరోవైపు ఉన్న పార్కులలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో పార్కు సూపర్వైజర్స్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణితం పట్ల అపోహలు విడనాడాలి..

### ఆసక్తితో సాధన చేస్తే గణితంలో ఎంతో తేలిగ్గా నైపుణ్యం సాధించ వచ్చు




**విజయవాడ పశ్చిమ, డిసెంబరు 20:(వార్తా ప్రభ ప్రతినిధి)**గణితం పట్ల అపోహలు తొలగించుకుని, ఆసక్తితో సాధన చేస్తే ఎంతో తేలికగా గణితంలో నైపుణ్యం సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభం నౌక్వాల్ అన్నారు. కెబిఎన్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యాన శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నౌక్వాల్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన గణితశాస్త్రవేత్త రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. వరాహమిహిర, ఆర్యభట్ల వంటి భారతీయ గణిత శాస్త్రవేత్తల స్ఫూర్తిని విద్యార్థులు అందుకోవాలన్నారు. గణితంలో నైపుణ్యం సాధిస్తే ఇతర సబ్జెక్ట్ లలో అతి తేలికగా సాధికారత పొందవచ్చన్నారు. పోటీపరీక్షల్లో విజయం సాధించడానికి గణితం కీలకంగా నిలుస్తుందన్నారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల గణిత విభాగం ప్రొఫెసర్ ఇ.ఎస్.ఆర్ రవికుమార్ మాట్లాడుతూ గణితాన్ని సంకేతాల భాషగా వర్ణించారు. భారతీయ చరిత్రకు గణితానికి ఉన్నసంబంధాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన జి.హెచ్.హార్డీ వంటి ప్రముఖులు కూడా శ్రీనివాస రామానుజన్ ప్రతిభకు ఆశ్చర్యపడ్డారన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గణితాన్ని క్రీడలతో మేళవించి బోధించడం వల్ల విద్యార్థుల్లో గణితం పట్ల భయం పోతుందన్నారు. ప్రొఫెసర్ రవికుమార్ కు శ్రీనివాస రామానుజన్ స్మారక పురస్కారం అందించి సత్కరించారు. గణిత విభాగాధిపతి పి.కల్మాబేగం తమ విభాగం నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేశ్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గణితదినోత్సవం, గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా నిర్విహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.




**విజేతల వివరాలు: క్విజ్:**ప్రథమ బహుమతి –ఎం.కీర్తిశ్రీ, ఎన్.దివ్యలిఖిత (శ్రీ శాస్త్ర కాలేజీ)ద్వితీయ బహుమతి –వి.ఎన్.ఎస్. భరత్ చంద్ర, వి.సాయిచరణ్, ఓ.కోవిద్ (విజ్ఞాన్ విజన్ జూనియర్ కాలేజీ) **సుడోకు:**ప్రథమ బహుమతి వి.ఎన్.ఎస్ భరత్ చంద్ర (విజ్ఞాన్ విజన్ జూనియర్ కాలేజీ)ద్వితీయ బహుమతి జి.తుషార్ (క్యాపిటల్ మెరిట్ జూనియర్ కాలేజీ) **గణిత అంత్యాక్షరి:**ప్రథమ బహుమతి వి.నాగహర్ష, కె.మణికంఠ కుమార్ (పి.బి.సిద్ధార్థ కాలేజీ)ద్వితీయ బహుమతి ఎస్.ప్రవీణ్, షేక్ జె ముదాసిర్ (పి.బి.సిద్ధార్థ) లు కైవసం చేసుకున్నారు.

## వివాదంగా ఉన్న చర్చి స్థల సమస్య పరిష్కారం



**మానిరేవు:డిసెంబర్ 20 (వార్తాప్రభ)** కళ్యాణదుర్గం మండలం మానిరేవులో దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య చర్చి స్థల విషయంపై వివాదం ఉంది. తరచూ చర్చి స్థల విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహణలో భాగంగా తహశీల్దార్ మానిరేవు గ్రామానికి వెళ్లారు. అక్కడ ఇరు వర్గాలతో చర్చించి, చర్చి స్థల సమస్యను పరిష్కరించారు. దీంతో ఇరువర్గాలు తహశీల్దార్ కు, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణ స్వామి జ్ఞాపకార్థం దుప్పట్లు, చీరలు పంపిణీ



**రెడ్డిగూడెం డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి):**మండలం, రంగాపురం గ్రామ శివారు బూరుగగూడెం గ్రామానికి చెందిన రామినేని వెంకటేశ్వరరావు తండ్రి దివంగత రామినేని నారాయణస్వామి 8 వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పేదలైన 50 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం నాడు బూరుగగూడెం లో రామినేని వెంకటేశ్వరరావు గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామినేని వెంకటేశ్వరరావు, రామినేని చక్రధర్ రావు, రామినేని రామకృష్ణ, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, కోశాధికారి సునీల్, సెక్రటరీ హన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు సామాజిక వికాసానికి అండగా నిలిచే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల విద్యార్థులు ఐఈఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (భూపాల్) పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన దేశవాళీ పోటీ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్%–%2024లో ఆ కళాశాల విద్యార్థుల జట్టు విజేతలుగా నిలిచారు. వారి అభినందన కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ 'ముడిపాలు, ప్రక్రియ చేసిన పాలు, పాల ఉత్పత్తుల సూక్ష్మజీవుల నాణ్యతను నిర్ణయించటానికి కృత్రిమ మేధస్సు ఆధారిత పద్ధతుల వినియోగం' అనే పేరుతో ప్రదర్శించబడిన ప్రాజెక్ట్‌కు బహుమతి లభించటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఈసీఈ విద్యార్థులు కే యశ్వంత్, జీ జ్ఞానశ్రీ, వీ కుందన్, ఆర్ నిస్సీ, బీ హేమంత్‌రెడ్డి, టీ వెంకట శ్రీనివాసరావులు చక్కని ప్రతిభతో బహుమతిని సాధించారన్నారు. వారిని వారిని తీర్చిదిద్దిన అధ్యాపకులు షేక్ మెహబూబ్‌సుభానీ తదితరులను అభినందిస్తున్నట్లు వివరించారు. ఈ విధమైన స్ఫూర్తితో ముమ్మందు మరిన్ని కార్యక్రమాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రఘువయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, డాక్టర్ కే సురేష్‌బాబు విభాగాధిపతి ఎం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## వంగల్లులో రెవెన్యూ సదస్సు



**సంగం, డిసెంబర్ 20 (వార్తాప్రభ)** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం వంగళ్లు సచివాలయం లో తహసీల్దార్ సోమ్లా నాయుక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుండి అర్జీలు స్వీకరించారు. సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని అర్జీదారులకు హామి ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి భూ సమస్యలైనా ఈ రెవెన్యూ సదస్సులో తెలుపుకోవచ్చని. సమస్యలకు వెంటనే పరిష్కారం మార్గం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రఘురామయ్య, సర్పంచ్ రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

## సాయిరెడ్డికి ఈడీ నజర్

**అమరావతి డిసెంబర్ 20 (వార్తాప్రభ)** కాకినాడ సెజ్, సీపోర్టులో వాటాల బదిలీ వ్యవహారంపై ఈడీ ఫోకస్ చేసింది. కాకినాడ సీపోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్ (కేసీపీఎల్) చైర్మన్ కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీఆర్) ఫిర్యాదుపై ఏపీ సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా కూపీలాగిన ఈడీ కాకినాడ పోర్టు వాటాల బదిలీలో మనీలాండరింగ్ జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించింది. దీంతో ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి నోటీసులు ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ ఇష్యూలో మాజీ సీఎం జగన్ సోదరుడు వై.విక్రాంత్ రెడ్డి నోటీసులు అందుకున్నారు. వీరిద్దరితోపాటు అరబిందో ఫార్మా డైరెక్టర్ పెనక శరత్ చంద్రారెడ్డి, పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఆడిటింగ్ కంపెనీ ప్రతినిధులకు ఈడీ నోటీసులు పంపింది.గత ప్రభుత్వంలో తనను బెదిరించి కాకినాడు సీపోర్ట్సు, సెజ్ లో 41 శాతం వాటాలు లాగేసుకున్నారని విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డి, శతర్ చంద్రారెడ్డిలపై కేవీఆర్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఏపీ సీఐడీ ఓ వైపు దర్యాప్తు చేస్తోంది. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా ప్రాథమిక సమాచారం తెప్పించుకున్న ఈడీ నిందితులకు నోటీసులిచ్చినట్లు చెబుతున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున తాను ప్రస్తుతం విచారణకు హాజరు కాలేనని ఎంపీ విజయసాయిరెడ్డి ఈడీకి లేఖ రాసినట్లు చెబుతున్నారు. అదేవిధంగా అనారోగ్యం పేరుతో విక్రాంత్ రెడ్డి, ముందుగా నిర్ణయించేకున్న పనుల వల్ల తాను రాలేనని శరత్ చంద్రారెడ్డి లేఖ రాసినట్లు చెబుతున్నారు. దీంతో ఈ ముగ్గురికి మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఈడీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా సీపోర్టు వాటాల బదిలీతో అంతిమ లబ్ధిదారు అరబిందో రియాల్టీ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్లకూ నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.కాకినాడ సీపోర్టు యజమాని కేవీఆర్ ఫిర్యాదుతో ఇప్పటివరకు ఏపీ సీఐడీ కేసును దర్యాప్తు చేస్తుంది. ఇప్పుడు ఈడీ కూడా రంగంలోకి దిగడంతో నిందితులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా మళ్లీ రమ్య కీర్తన



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి):**– కొండపల్లి పురపాలక సంఘం కమిషనర్ గా బి.రమ్యకీర్తనను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.హరి నారాయణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ పి.శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ రమ్య కీర్తనకు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో రమ్య కీర్తన మూడు నెలల పాటు ఇక్కడ పనిచేశారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

# హైకోర్టు ఆటల పోటీల్లో న్యాయవాది డాక్టర్ అన్వర్ షేక్ ప్రత్యేక ప్రదర్శన



**(విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20:వార్తా ప్రభ (ప్రతినిధి)** రాష్ట్ర హైకోర్టు 2023–2024 సంవత్సరానికి నిర్వహించిన ఆతిథ్యభరితమైన ఆటల పోటీల్లో విజయవాడకు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ అన్వర్ షేక్ సత్తా చాటారు. ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో వంటి వివిధ విభాగాల్లో పాల్గొని, పలు బహుమతులను గెలుచుకుని అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు.ప్రత్యేకంగా, కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో పోటీలలో డాక్టర్ అన్వర్ షేక్ 30 గ్రాముల రజత నాణేలు మరియు మోమెంటోలను గెలుచుకోవడం, తన క్రీడా క్షేత్రంలో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారని అభిప్రాయపడిన పలువురు. ఈ బహుమతులు ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రాంగణంలో జరిగిన ఘనమైన వేడుకలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బి. కృష్ణమోహన్ మరియు సీనియర్ న్యాయవాది పట్టాభి చేతుల మీదుగా అందజేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు నైనాల జైసూర్య, కె. సురేష్ రెడ్డి, రవిచీమలపాటి, సుమతి జగదామ్, బి. వి. ఎల్. ఎన్. చక్రవర్తి మరియు ముఖ్య అతిథిగా బి. కృష్ణమోహన్ పాల్గొని ఈ విజయాన్ని గుర్తించి డాక్టర్ అన్వర్ షేక్‌ను అభినందించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో పాల్గొని, కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో వంటి ఈవెంట్లలో బహుమతులు గెలుచుకోవడం నా జీవితంలో అతి ఉత్సాహభరితమైన అనుభవంగా మిగిలిపోయింది. ఈ విజయం నా జీవితం కోసం ఎంతో ప్రేరణను అందించింది. భవిష్యత్తులో కూడా ఈ రకమైన పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను" అని ఆయన తెలిపారు.ఈ క్రీడా పోటీలు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. చిదంబరం ఆధ్వర్యంలో, సంఘం కార్యనిర్వహణా కమిటీ ఏర్పాటులో విజయవంతంగా నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమం నిర్వహణలో తన గురువు వేములపాటి పట్టాభి కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.డాక్టర్ అన్వర్ షేక్ సాధించిన ఈ విజయాలు కేవలం ఆయన క్రీడా ప్రతిభను మాత్రమే కాకుండా, సానుభూతి, కష్టపడి పనిచేసే మనోభావాన్ని కూడా ప్రతిబింబిస్తాయన్నారు.

# "మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్"



సాధారణ జీవితంలో సుదీర్ఘ ప్రయాణం సంసారమే. ప్రయోగం చేసే ఉపగ్రహం తొడుగులు విడిపోయినట్లుగా కన్న బంధాలు మనకు మూడు ముడుల బంధం అందించి ముందుకు నడుపుతూ...ఆ మధ్యలో ఎక్కడో అమ్మ నాన్న తొడుగుల్లా విడిపోతారు. మన ప్రయాణం సాగుతూనే ఉంటుంది. ఇప్పుడు తోడు నీడ భర్తకు భార్య, భార్యకు భర్త. ఆ ప్రయాణం లో అర్థమయ్యే సత్యం ఏమిటంటే...ఈ భార్య, లేదా ఈ భర్త కాకపోతే మన జీవితం బహుశా పేక మేడలా ఏమైయ్యేదో...అని ఎప్పుడోకప్పుడు తోస్తుంది.. ఎందుకంటే మన లోపాలు మనకు పూర్తిగా తెలుసు. దీనినే పెళ్ళిళ్ళు స్వర్గంలో నిర్ణయించబడతాయి.. అంటారు. "మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్"మనం తల్లిదండ్రులం అయ్యాక అమ్మానాన్న విలువ తెలిసి వారిని అప్పుడు ఆరాధిస్తాం. కొందరు ముందుగానే గ్రహిస్తారు. అది ముందస్తు సంస్కారం. మళ్ళీ మనం పిల్లలకు పెళ్లి చేయడం అంత ఈజీ కాదు అని అనుభవానికి వస్తుంది. ఈ ప్రపంచంలో ఏ సైంటిస్ట్ కనిపెట్టలేని గొప్ప విషయం ఏమిటంటే...కరెక్ట్ పెళ్లి సంబంధం కనిపెట్టడం అంటారు. కానీ మన అనుభవంలో తెలుసుకున్న మాట...ఏ బొమ్మకు ఏ బొమ్మో...రాసి పెట్టి ఉంటుంది అని... కొందరు ధైర్యం చేసి వాళ్ళ బొమ్మలు వాళ్ళే వెదుక్కుంటారు... దానిని లవ్ మ్యారేజ్ అంటారు. సక్సెస్ఫుల్ లవ్ మ్యారేజ్ లు తక్కువ అంటుంటారు. ఇంతకీ ఈ సుదీర్ఘ ఉపోద్ఘాతం మా ఆవిడ పుట్టినరోజు గురించి.. జీవితంలో చూసిన ఒకేఒక్క పెళ్లి చూపులు... స్వీట్ కూడా రుచి చూడలా... కానీ వద్దన్నాను. మా నాన్న నీకు తనే అన్నారు. అయినా నో అన్నాను. గురువుగారు ఏమైంది పెళ్లి చూపులు అన్నారు. నొ చెప్పాను అన్నాను. అదేమిటి ఆమే మీ భార్య అన్నారు. లేదు లేదు అన్నాను. ఏమో! ఆమెతోనే మీకు రాసిపెట్టి ఉంది. కావాలంటే వేచి చూడండి అన్నారు. చూడను గాక చూడను అన్నాను. నవ్వి ఊరుకున్నారు. ఏదో అయ్యింది. ఇంకేదో జరిగింది. కాలం ఆరునెలలు గడిచింది. నేను ఫ్రీ ఫ్రీ అనుకున్నాను. కానీ దుష్ట గ్రహాలన్నీ ఒక్కటై నన్ను బంధించాయి. సడెన్ గా ఆ అమ్మాయితోనే పెళ్లి కుదిరింది. అది కూడా ఒక్క రోజు లో. ఈరోజు ఓకే అనుకుంటే... ఎల్లుండి పొద్దునే... ఒక్క రోజు గ్యాప్. వప్పన్నాలు లేవు, తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నది లేదు.. లగ్నపత్రి మార్చుకోవడం లేదు... పెళ్ళి శుభలేఖలు పంచడం లేదు... అసలు పెళ్ళికొడుకు అయ్యిందే లేదు.. ఉద్యమ దీక్షలో ఉన్నవాడిని అర్థరాత్రి తరలించినట్లు తీసుకుపోయి పెళ్లి చేసేసారు. బట్టలు మా విజయ్



జెంట్స్ షోరూం విజయ్ చూసుకున్నాడు. తాళిబొట్టు మా అడపా బాబ్జీ చూసుకున్నాడు. నేనేం చూసుకోవాలో తెలియక ఫస్ట్ షో కి ఎన్టీ రామారావు పెళ్లి చేసి చూడు సినిమా గంగామహల్ లో చూసుకుని వచ్చాను. కాళ్ళు తన్నిపెట్టి పడుకుంటే మా అక్కా చెల్లెళ్ళు ఒళ్ళంతా గోరింటాకు పెట్టేశారు. మే 11 , 1996 ఉదయం 5–00 గంటలకు కారులో కుదేశారు. 9–32 కి పెళ్ళై పోయింది. బిక్క మొహం బాగోదని నవ్వు నవ్వి నవ్వి చివరికి జీవితం అంతా ఆ నవ్వే అంటుకుంది. తెల్లారి హనుమజ్జయంతి. పెళ్ళాంతో గురువుగారి ముందు సాగిలపడ్డాను. ఆయన పకపకా నవ్వుతూ "చెప్పినప్పుడు చేసుకుంటే ఈ హడావుడి లేకపోను కదా"...అన్నారు. మానాన్న కోరుకున్న కోడలు వచ్చింది. మా గురువు గారు చెప్పిన భార్య వచ్చింది. ఇప్పుడు నా పెళ్ళాం నాకూ నచ్చింది. పెళ్ళిళ్ళు స్వర్గంలో నిర్ణయించబడతాయి అనే మాట నా విషయంలో నూటికి నూరుపాళు నిజం అయ్యింది. నా ఇంటి పేరు నవ్వుల పొదరిల్లు సత్యనారాయణ బాబు గా స్థిరపడడం ఎలా సాధ్యం అంటే... జీవితం అంతా నా సంతోషాన్ని రెట్టింపు చేయడమే పనిగా పెట్టుకున్న భార్య దొరకడం వలన. నేను వద్దని తోసేసినా... దేవుడికి నాకేం కావాలో తెలుసుకనుక...తగిన భార్యను అందించడం గొప్ప. ఇప్పుడు అందరూ చెబుతారు నా భార్య నా అదృష్టం అని. కానీ నేను ఎలా అదృష్టమో కూడా చెప్పాను. నేను గోసేవ కోసం అర్థరాత్రి అపరాత్రి వెళుతున్నా ఎదురొచ్చి పంపే భార్య. నేను బిడ్డలు మీరు అలా వెళ్ళిపోతే ఎలా? అని దశాబ్దాలుగా నిలవేయని భార్య.. నా సాహిత్య సాంస్కృతిక రచనా వ్యాసంగం విషయంలో ... సంఘసేవ విషయంలో ఆధ్యాత్మిక ప్రయాణాల విషయంలో... అంతులేని అవిశ్రాంత కృషిలో నోరు మెదపని భార్య. పైగా మంచి మంచి జోక్స్ తో .. కథలు చదవడంలో, నా డ్రెస్సింగ్ ఫ్రెష్ కాంబినేషన్ లో తాను ఎలర్ట్. 27 సంవత్సరాల వివాహ బంధంలో కోరిన ఏకైక కోరిక అమ్మాయి శ్రీకళ పెళ్లి ఘనంగా చేయాలి...మన పెళ్ళిలా కాదు...అని.. నిరాడంబరత కి ప్రాధాన్యం ఇచ్చే నేను కొంత వారిద్దాం అనుకున్నా...తన కోరిక కరెక్ట్ అనిపించింది. దైవం అన్ని విధాలా సహకరించింది. గురువుల ఆశీస్సులు అనుగ్రహం లభించింది. గోవుల సేవ, దైవపరమైన నా నడకకు తగిన వియ్యాలవారిని ఎక్కడో బాపట్ల నుంచి నాకున్న సమస్త నిబంధనలు పాటించేలా అంగీకరించేలా పెళ్లి ఘనంగా జరిగింది. అన్ని కార్యక్రమాలు సూపర్ హిట్టయిన సినిమా వలె అలరించాయి. ఎన్నో మహత్యాలు జరిగాయి. ఆపదలు అడ్డు పడకుండా ఆగాయి. స్నేహసంపద తమ విశ్వరూపాన్ని చూపించింది. ఈ పెళ్లిలో జరిగిన వింతలు విశేషాలు తలుచుకుంటే.... ధర్మో రక్షతి రక్షితః అనే పదం ప్రాక్టికల్ గా నెరవేరింది. అలాంటి మంచి పెళ్లి కోరిక తీర్చుకున్న నా పెళ్ళాం (మా ఆవిడ – బహువచనం కదా అని తమిళనాడు ఆర్బీఐ అధికారి వైద్యనాధన్ మాట) పుట్టిన రోజు వచ్చిన ఈ సంవత్సరం నిజంగా ఆనందం ఆనందం....

**–డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)**
20–12–2024

# చంద్రబాబు గారి జీవితం ప్రజలకే అంకితం

**–2047 నాటికి ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుంది**
**–కుప్పం అభివృద్ధికి 40 పథకాలు అమలు చేస్తున్నాము**
**–కుప్పం మున్సిపాలిటీ పరిధి డీకే పల్లిలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి**





**కుప్పం, డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**గత ప్రభుత్వంలో పేదల పొట్ట కొట్టి వారి పొట్ట నింపుకున్నారని, అన్ని వర్గాల ప్రజలను వేధించారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. మచ్చ లేని చంద్రబాబు గారికి అవినీతి మరక అంటించేందుకు అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేశారని అన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డీకే పల్లిలో భువనేశ్వరి పర్యటించారు. మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ...చంద్రబాబు గారు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. ఆయనకు ప్రజలే కుటుంబం. మేము ఎప్పుడూ ప్రజల సొమ్ము దోచుకునేవారం కాదు. రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రలు చేశారు. విధ్వంస పాలనతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు గారు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ఆయన పాలనలో అభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవడం ఖాయం.

**నిజం గెలవాలి యాత్రతో ప్రజలకు మరింత చేరువ:**నేను నిజం గెలవాలి యాత్ర చేయాలనుకున్నప్పుడు కొందరు శ్రేయోభిలాషులు వద్దని వారించారు. మహిళ అని కూడా చూడకుండా ఇబ్బంది పెడతారని హితవు పలికారు. కానీ ముందుకు నడిచాను. మన తెలుగుదేశం కార్యకర్తలు నాకు అండగా నిలబడ్డారు. యాత్రలో నేను అన్ని వర్గాల ప్రజలను స్వయంగా కలుసుకున్నాను. వారు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. గత పాలకులు యువతను గంజాయికి బానిసలు చేసి వారి భవిష్యత్ నాశనం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. కుప్పం ప్రజలు, రాష్ట్ర ప్రజలకు నేను ఒకటే చెబుతున్నాను. చంద్రబాబు గారు ఏపీని ఖచ్చితంగా నెంబర్ వన్ స్టేట్ చేస్తారని హామీ ఇస్తున్నాను. అంతకుముందు నారా భువనేశ్వరికి మహిళలు పూలు, హారతులతో ఘన స్వాగతం పలికారు. వేదిక సమీపంలో ఉన్న ప్రసన్న అగ్ని మారెమ్మ దేవస్థానంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. ముఖాముఖి అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.

# ఎస్ బి ఐ మేనేజర్ కు సన్మానం



**మల్కాజిగిరి: డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**రైల్వే ఉద్యోగులకు వసతులు కల్పించడంలో చేసిన కృషికి గాను ఎస్ బి ఐ మేనేజర్ సాయి లత ను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో లిల్లీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హజ్రా, పద్మావతి, సంధ్యా రాణి, విశాలాక్షి, కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో విజయ్ డిజిటల్ 'ది ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్' ను ప్రారంభించిన మంత్రి లోకేష్

## పాల్గొన్న కూటమి నేతలు, కార్యకర్తలు




**మంగళగిరిః డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**పాత మంగళగిరిలో విజయ్ డిజిటల్ షోరూమ్ నిర్వాహకులు నూతనంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్స్ సూపర్ స్టోర్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా షోరూమ్ వద్దకు చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు నిర్వాహకులు, కూటమి నేతలు, కార్యకర్తలు రెడ్ కార్పెట్ తో ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి స్టోర్ సముదాయాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. షోరూమ్ మొత్తం కలియతిరిగి ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరిశీలించారు. విజయ్ డిజిటల్ షోరూమ్ ప్రస్థానం, అభివృద్ధి, బ్రాంచ్ ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఫోటోలు దిగారు. కార్యకర్తలు, సామాన్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఉరవకొండకి రైల్వే లైన్ ప్రతిపాదించండి: జనసేన పార్టీ

**ఉరవకొండ డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**పార్లమెంటు సమావేశాల్లో ఉరవకొండ కి రైల్వేలైన్ ప్రతిపాదన చెయ్యాలని జనసేన పార్టీ ఉరవకొండ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇంచార్జ్ గౌతమ్ అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణను శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే ఉరవకొండ మీదుగా గుంతకల్లు, తుమకూరు స్టేషన్లను కలిపే ప్రతిపాదన ఉందని కానీ ప్రస్తుతం ఆ విషయమే మరుగున పడిపోయిందని ఎన్డీఏ ప్రభుత్వం ఉరవకొండ ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని కోరారు.

# తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారు- హరీశ్‌రావు



**హైదరాబాద్: డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారు.. వారికి అభినందనలు తెలియజేస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇది డొల్ల కేసు అని మొదటి అడుగులోనే స్పష్టమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా–ఈ రేసు అంశంపై అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడారు. ఫార్ములా–ఈ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చించాలని కోరితే.. భారాస సభ్యులను సభ నుంచి బయటకు పంపి చర్చించారు.ఫార్ములా–ఈ రేస్‌కు మూడో విడత కింద 50 శాతం నిధులు.. 45 లక్షల పౌండ్లు చెల్లించకపోవడం వల్ల అగ్రిమెంట్ రద్దు చేసుకుంటున్నామని ఏవీవీ కంపెనీ డిసెంబరు 22న దాన కిశోర్‌కు లేఖ రాసింది. 50శాతం నిధులు అంటే కేవలం రూ.45 కోట్లు మాత్రమే. నిధుల చెల్లింపుల్లో ఇర్రెగ్యులారిటీ తప్ప.. ఇల్లీగల్ మాత్రం లేదు. రేసింగ్ నిర్వహించిన సంస్థకు హెచ్‌ఎండీఏ నుంచి చెల్లింపులు జరిగాయి. ఫార్ములా రేసింగ్ నిర్వహించేందుకు 192 దేశాలు పోటీపడ్డాయి. రేసింగ్ కోసం మొదటి దఫాలో రూ.30కోట్లు ఖర్చు పెడితే జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు రూ.71 కోట్లు వచ్చింది. మూడో విడతలో రూ.45 కోట్లు చెల్లిస్తే..రాష్ట్రానికి రూ.600 కోట్ల లాభం వచ్చేది. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వల్ల తెలంగాణ ప్రతిష్ఠ పెరిగింది. తమిళనాడు ప్రభుత్వం ఫార్ములా–4 నిర్వహించి రూ.140 కోట్లు ఖర్చు పెట్టింది. చంద్రబాబు ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చు పెట్టి ఆఫ్రో–ఏసియన్ గేమ్స్ నిర్వహించింది.గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు కొనసాగొద్దని, సభలో కేటీఆర్ నిలదీయకుండా ఉండాలని అక్రమ కేసులు పెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్ర పరపతి, ఇమేజ్ దెబ్బతింటోంది. తన ఏడాది పాలనా వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు గిమ్మిక్కులు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబం అవినీతిని ఎప్పటికప్పుడు కేటీఆర్ బయటపెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్రంలో స్థిరాస్తి రంగం కుదేలైంది. మాకు కోర్టుల మీద నమ్మకం ఉంది. అక్రమ కేసులకు భయపడేది లేదు. ఫార్ములా రేసింగ్ కేసు వివరాలు ఈడీ అడిగిందని వార్తల్లో చూశాను. నిన్న నమోదు అయిన కేసులో వెంటనే ఈడీ జోక్యం వెనుక మతలబు ఏంటి? కాంగ్రెస్, భాజపా దోస్తానా స్పష్టంగా అర్థమవుతోంది. కుట్రలు చేసి కేటీఆర్‌ను జైలులో పెట్టడమే రేవంత్‌రెడ్డి లక్ష్యం. అసెంబ్లీలో చర్చ పెడితే కేసు డొల్లతనం బయటపడుతుంది" అని హరీశ్‌రావు అన్నారు.

# కేటీఆర్ తప్పు చేశారు- ఎమ్మెల్సీ కోదండరాం



**హైదరాబాద్: డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**పనికిరాని స్థలంలో మేడిగడ్డ కట్టారని ఎమ్మెల్సీ కోదండరాం విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిందేనని చెప్పారు. మేడిగడ్డ పనికిరాదని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పిందని అన్నారు. హైదరాబాద్: ఫార్ములా వన్ రేస్ అంశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవడం తప్పేం కాదని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు.ఏబీఎన్‌తో ఎమ్మెల్సీ కోదండరాం శుక్రవారం ఫార్ములా వన్ రేస్ కేసు విషయంలో కేటీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ఇలా ఎందుకు అయ్యిందో విచారణకు వచ్చి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చెప్పాల్సిందేనని కోదండరాం అన్నారు. కాళేశ్వరం విచారణకు రావడం కేసీఆర్ బాధ్యత అని చెప్పారు. క్యాబినెట్ అనుమతి లేకుండా ఫార్ములా వన్ రేసు కోసం ప్రజాధనం ఎలా దుర్వినియోగం చేస్తారని ప్రశ్నించారు. ఫార్ములా వన్ రేసు తొందరపాటు నిర్ణయం కాదని.. కేసీఆర్ ప్రభుత్వ తప్పిదమని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఫార్ములా వన్ రేసులో కేటీఆర్ తప్పు చేశారని అన్నారు.కొత్త కారు కొనడంపై వస్తున్న విమర్శలపై కోదండరాం స్పందించారు. తాను ఈరోజు కాకపోతే రేపైనా కొత్త కారు కొనుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తన కారు ఇప్పటికే చాలా కిలోమీటర్లు తిరిగిందని... కొత్తది కొనడం తప్పక కొన్నానని తేల్చిచెప్పారు. ఎమ్మెల్సీ అయ్యాక ఇచ్చే లోన్ తీసుకొని కొత్త కార్ తీసుకున్నానని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిందేనని చెప్పారు. మేడిగడ్డ పనికిరాదని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పిందని అన్నారు. పనికిరాని స్థలంలో మేడిగడ్డ కట్టారని విమర్శించారు. అన్ని డబ్బులు ఖర్చు చేసినా డిజైన్ లోపాలు, నాణ్యత లోపాలు ఉన్నాయని అన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర నిర్మాణం చేయాలనే డిమాండ్‌కి రేవంత్ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని నమ్ముతున్నానని అన్నారు. కాళేశ్వరం పనికిరాదని నిపుణులు చెబుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు.

# గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణి



**గుంతకల్లు డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)** పెద్దవడుగూరు మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం దగ్గర శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి టీం ఆధ్వర్యంలో పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం సినియర్ సిటిజెన్ సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధులు ఎస్సై ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ వృద్ధులకు చలికాలంలో దుప్పట్లు చాలా ఉపయోగకరంగా ఉంటుందని దాత గుత్తి పట్టణ వాస్తవ్యులు కరణం హనుమంతరావు కుమారుడు రంగనాథ్ రావుకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తీవ్ర దెబ్బకొట్టే ఆలోచనతో బిజెపి ప్రభుత్వం- ఏం.సి.పి. ఐ.(యు)




**శేరిలింగంపల్లి,డిసెంబర్ 20 (వార్తాప్రభ):**మియాపూర్ మియాపూర్ డివిజన్ పరిధిలోని ముజఫర్ అహ్మద్ నగర్ లోఎంసిపిఐ(యు)పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి కాడ్రేమ్‌డ్గదాగోని రవి మాట్లాడుతూ ఇటీవల జమిలి ఎన్నికల పై పార్లమెంటు ముందు బిల్లు రావడం,పార్లమెంటు లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత పద్ధతుల్లో అవహేళన చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వాఖ్యలు పరిశీలిస్తే రానున్న కాలంలో బారత రాజ్యాంగానికి,పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన దెబ్బ కొట్టే లక్ష్యం తో ఉందని ఇది బిజెపి యొక్క ఫాసిస్టు దోరణి స్పష్టంగా బయట పడుతుంది అని అందులో బాగంగా నే బిజెపి పార్లమెంటు లో వ్యవహారిస్తుంది అని అన్నారు.పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలు మరియు మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన అవకతవకలు,మణిపూర్ లో హత్యాకాండ,రైతు,కార్మిక ఉద్యమాలు చర్చకు రాకుండా పార్లమెంటు ను పక్క దారి పట్టించే విధంగా చర్యలు తీసుకొని బిజెపి ప్రజలను చట్ట సభలను పక్కదారి పట్టించే విదానాన్ని యంసిపిఐ(యు) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవిఅన్నారు.రానున్న కాలంలో ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సమావేశం పిలుపు నిచ్చింది.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి,వనం సుధాకర్,జిల్లా కార్యదర్శి సహాయ కార్యదర్శి,తుడుం అనిల్ కుమార్,తాంద్ర కళావతి,పి బాగ్యమ్మ,పల్లె మురళి,ఇస్లావత్ దశరత్ నాయక్,కర్ర దానయ్య,యం.వై కుమార్,బి.విమల తదితరులు పాల్గొన్నారు.

## ఇంధనాన్ని ఆదా చేదాం - భావితరాలకు భవిష్యత్తును ఇద్దాం

డా.ఎన్ టి టి పి ఎస్ ఎనర్జీ మేనేజర్ బి హరి




**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 20( వార్తా ప్రభ ప్రతినిధి):-** ఇంధనాన్ని పొదుపుగా వాడడం ద్వారా భావితరాలకు భవిష్యత్తును ఇద్దామని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం ఎనర్జీ మేనేజర్ బి హరి తెలిపారు.జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా డా. ఎన్ టి టి పి ఎస్ అధికారులు స్థానిక డా.జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో కళాశాల ఆవరణలో అవగాహన సదస్సుని శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి హరి మాట్లాడుతూ యాంత్రీకరణ బాగా పెరిగినందున సహజ వనరులు తరిగిపోతున్నాయన్నారు. ప్రజలు ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ ఇంటెండెంట్ ఇంజనీర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి చోటా ఫైవ్ స్టార్ రేటింగ్ కలిగిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఉపయోగించి విద్యుత్ ను పొదుపు చేయాలన్నారు. డా. ఎన్ డి టి పి ఎస్ డిప్యూటీ సెక్రటరీ సుశీల మాట్లాడుతూ మనదేశంలో ఉన్న పెట్రోలు మరియు డీజిల్ ఇదేవిధంగా ఉపయోగిస్తే మరి మరో 15 సంవత్సరములకు పూర్తిగా అడుగంటి పోతాయన్నారు.ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా డిగ్రీ మరియు జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో విజేతలైన డిగ్రీ విద్యార్థులు వి.సన్నీ, ఎం.సుధామయి, ఎస్.కే ఖాజావలి, కె.అభిచందన్ మరియు జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్.కె.జుబేదా, ఎం.ప్రమీల, ఎస్.కె.హుస్సేన్, మహబున్ని లకు మెడల్స్ బహూకరించారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ మరియు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ మస్తాన్వలి, జాఫర్ సాదిక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగుల్ మీరా, అధ్యాపకులు బందగి బేగ్, రాము, సంతోష్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మళ్లీ అజ్ఞాతంలోకి మంచు మోహన్ బాబు

జర్నలిస్ట్‌పై దాడి కేసులో మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు

**హైదరాబాద్: డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)** ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో మోహన్ బాబు పిటిషన్.. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరిన బాబు తరపు న్యాయవాది.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, కౌంటర్ దాఖలు తర్వాతే విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటామన్న హైకోర్టు.. మోహన్ బాబు బెంగళూరులో ఉన్నట్లు పోలీసుల అనుమానం

## సంగారెడ్డి జైలు నుంచి విడుదలైన 16 మంది రైతులు

ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల నినాదాలు

తమను అన్యాయంగా అరెస్ట్ చేశారని మండిపాటు

**సంగారెడ్డి, డిసెంబర్ 20 (వార్తా ప్రభ ప్రతినిధి)**లగచర్ల ఘటనలో అరెస్టయిన 16 మంది లగచర్ల రైతులు సంగారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. ఈ ఉదయం వీరంతా జైలు నుంచి బయటకు వచ్చారు. దాదాపు నెల రోజుల పాటు వీరు జైల్లో ఉన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన రైతులకు బీఆర్ఎస్ నేతలు, గిరిజన సంఘాలు స్వాగతం పలికాయి. మరోవైపు జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమను అన్యాయంగ అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రదేశంలో తాము లేమని చెప్పారు. అర్ధరాత్రి తమను అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలకు గురి చేశారని మండిపడ్డారు. తమకు పరిహారం, ఉద్యోగాలు ఇచ్చినా ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. జైల్లో ఉన్న మిగిలిన రైతులకు కూడా బెయిల్ ఇప్పించాలని కోరారు. తమ గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ఈ గొడవకు కారణమని, ఆయనను ఇంతవరకు అరెస్ట్ చేయలేదని చెప్పారు. శేఖర్ ను విచారిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. జైలు నుంచి విడుదలైన రైతులకు నాంపల్లి కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ పత్రాలు నిన్న ఆలస్యంగా జైలు అధికారులకు చేరాయి. దీంతో, రైతులు నిన్న విడుదల కాలేదు. ఈ క్రమంలో ఈ ఉదయం వీరు జైలు నుంచి విడుదలయ్యారు.

## కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్న టీపీసీసీ కో ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ

### ఏసీబీ ముందే కేటీఆర్ నిజాయితీ నిరూపించుకోవాలి

**కూకట్ పల్లి,డిసెంబర్ 20(వార్తాప్రభ):**ఫార్ములా – ఈ రేస్ వ్యవహారంలో తప్పు చేయకపోతే ఏసీబీ విచారణకు కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు అని టిపిసిసి కో – ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ ప్రశ్నించారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వానికి 8 కోట్ల రూపాయలు జరిమానా విధించింది వాస్తవమా కదా? ఆ జరిమానాని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిది నిజమా, కాదా? మీరు ఏ తప్పు చేయకపోతే ఆర్.బి. ఐ.ఎందుకు జరిమానా విధించింది,అనుమతి లేకుండా విదేశీమారకం చెయ్యటం నేరం కాదా? ప్రభుత్వ అనుమతి లేకుండా రహస్యంగా 55కోట్లను ఈ రేస్ వాళ్లకు చెల్లింపులు చేయడం తప్పు చేయడం కాదా? ప్రజల సొమ్ముని మీరు రహస్యంగా ఎలా చెల్లింపులు చేస్తారనీ కె.టి.ఆర్.ను ప్రశ్నించారు..ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం పెంచటానికి ఈ రేస్ కి ఏమి సంబంధం.అమెరికా లో చదివిన మీరు మాట్లాడవలసిన మాటలేనా ...రేవంతరెడ్డి కి భూమి వుంది అది టిడిపి హయాంలో ప్రభుత్వం ఈ ఫార్ములా కోసం తీసుకుంది అందుకే ఆయనకు ఫార్ములా రేస్ అంటే పడదు అంటే ఇ మాటలు మీకు సరిపోతాయా. చాలా మంది దిగ్గజులు వచ్చారు అంటే దానివలన రాష్ట్రానికి గానీ ప్రజలకు గానీ జరిగిన మేలు ఏమిటి, మీ ఉద్దేశం వాళ్లపైన కేసులు పెట్టమని కోరుతున్నారా మీరు తప్పు చేయనప్పుడు విచారణ ఎదుర్కోవాలి గానీ హైకోర్టు లో స్క్వేష్ కి వెళ్లడం ఎందుకు. మేకపోతు గంబీర్యం చూపించి మేము పోరాటాయోధులం మా రక్తం లోనే పోరాటం వుంది అని ప్రగాల్భాలు పలికి మళ్ళీ కోర్ట్ తలుపులు తడితే ప్రజలు నవ్వుకుంటున్నారని గమనించండి.నడుస్తున్న ప్రజాప్రభుత్వం లో వ్యక్తిగత ద్వేషం గానీ కక్ష సాధింపులు గానీ ఉండవని, తప్పుచేసిన వారు శిక్షను అనుభవించాలి అనేది ప్రభుత్వ ఉద్దేశం గా గాలి బాలాజీ పేర్కొన్నారు.



## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి -కాంగ్రెస్ నేత బండి రమేష్.



**కూకట్ పల్లి,డిసెంబర్ 20(వార్తాప్రభ):**నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిది ఆర్థిక భరోసా కల్పిస్తోందని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ పేర్కొన్నారు.కూకట్పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్పల్లికి చెందిన పెద్దింటి లక్ష్మి కి 60,000/- రూపాయల అల్లాపూర్ కి చెందిన నూలు జాన్వి 60000/- రూపాయల చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనవి. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి సంబంధించిన 1,20,000 రూపాయల చెక్కులను బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య ,తూము వేణు పుష్ప రెడ్డి, కుక్కల రమేష్, కృష్ణ రాజ్పుత్, మొయిజుద్దీన్, రేష్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వచ్ఛత వైపు మరో సాంకేతిక అడుగు

### విజయవాడ కోసం ప్రయోగత్మక కంపాక్టర్ వాహనం ను ఏర్పాటు చేసిన మంత్రి నారాయణ



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ ప్రతినిధి )**నగర స్వచ్ఛతను మరింత మెరుగుపరిచేందుకు ప్రయోగత్మక కంపాక్టర్ వాహనం ను ఏర్పాటు చేశారు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్ పొంగూరు నారాయణ. శుక్రవారం ఉదయం లెనిన్ సెంటర్ వద్ద గల సిఆర్డిఏ కార్యాలయం నందు ఈ డెమో



వెహికల్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ స్వచ్ఛత వైపు సాంకేతిక అడుగు వేసేందుకు ప్రయోగాత్మకంగా ఆధునిక టెక్నాలజీ తో కూడిన 14 టన్నుల సామర్థ్యం గల కంపాక్టర్ ను విజయవాడ నగర పాలక సంస్థ వినియోగించేందుకు ఏర్పాటు చేశారు. ఈ వాహనంను వాడి, ఆ వాహనంపై ఖచ్చితమైన ఫీడ్బ్యాక్ ను అందించినచో , ఆ వాహనాన్ని రాష్ట్రం మొత్తంలో అమల పరచి స్వచ్ఛతను మరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్ సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ వెహికల్ డిపో ఏసు పాదం పాల్గొన్నారు.

## ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ)పై అధికారులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### ప్రత్యేక అవసరాలున్న చిన్నారులపై దృష్టిపెట్టండి..

### పీఎం దిశ సర్టిఫికేషన్ కోర్సు సూచికల ప్రగతికి కృషిచేయాలి.



**విజయవాడ డిసెంబర్ 20 :(వార్తా ప్రభ ప్రతినిధి )**ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి ప్రణాళికల అమలుపై ప్రత్యేకంగా దృష్టిసారించి, మంచి ఫలితాలు సాధించడం జరిగిందని.. ఇదేవిధమైన కార్యాచరణతో పాటు ప్రత్యేక అవసరాలున్న చిన్నారులపై దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్చువల్ సమావేశానికి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నుంచి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో 500 ఆకాంక్షిత బ్లాకులను ఎంపిక చేయగా.. ఈ జాబితాలో ఎన్‌టీఆర్ జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం,పెనుగంచిప్రోలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణతా అభియాన్ చొరవ కింద ప్రధానంగా గర్భిణీల రిజిస్ట్రేషన్, వారికి ఆరోగ్యం పరంగా అవసరమైన సేవలు అందించడం, పోషకాహారం అందించడంబీ హైపర్ టెన్షన్, మధుమేహం స్క్రీనింగ్, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందించడం, ఎస్‌హెచ్‌జీలకు రివాల్వింగ్ ఫండ్ తదితరాలపై ఈ ఏడాది జులై 1 నుంచి మూడు నెలల పాటు ప్రత్యేకంగా కృషిచేయడం జరిగింది. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ సీఈవో మంచి ఫలితాలు చూపిన బ్లాకులను అభినందిస్తూ రివార్డు మొత్తాన్ని త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నిధుల వినియోగం, ఎన్ఎఫ్ఎస్ ప్లాట్‌ఫాం తదితరాలతో పాటు ఆకాంక్షిత బ్లాకు స్థాయిలో భవిష్యత్తు కార్యాచరణపైనా దిశానిర్దేశం చేశారు.అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో పాటు 9 రంగాలు, 40 సూచికల్లో వివిధ సూచికల ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేసి, మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించడంలో ముున్ముందు ఇదేస్థాయి చొరవ చూపాలన్నారు. 40 కీలక సూచికల ప్రగతికి సంబంధించి జాతీయ, రాష్ట్ర, బ్లాక్ స్థాయి గణాంకాలను సంగ్రహించి విశ్లేషించాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎం దిశ) సర్టిఫికేషన్ కోర్సు సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో సీపీవో వై.శ్రీలత, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సునీత శర్మ, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, పెనుగంచిప్రోలు బ్లాక్ కోఆర్డినేటర్ బ్లాక్ కోఆర్డినేటర్ మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు .



## గోపికా గీతం

(తిరుప్పావై)

### ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం

### నాల్గవ పాశురం:

"ఆళిమళైక్కణ్ణా ! ఒన్రు నీకై కరవేల్
ఆళియుళ్ పుక్కు ముగున్దు కొడార్తేరి
ఊళిముదల్వ నురువమ్పోల్ మెయికరుత్తు
పాళియందోళుడై పర్పనాబన్ కైయిల్
ఆళిపోళ్ మిన్ని, వలమ్బురి పోల్ నిన్రదిరిన్దు
తాళాదే శార్ జ్ఞముదైత్త శరమళైపోల్
వాళవులగినిల్ పెయ్ దిడాయ్ నాంగళుమ్
మార్గళి నీరాడ మగిళిన్దేలో రెమ్బావాయ్"

**వివరణ:**విశ్వంలో విఖ్యాతమైన ఔదార్యానికి అధిపతివైన ఓ పర్జన్య దేవుడా! మేము గొల్లగోపికలతో కలిసి ఆచరిస్తున్న ధనుర్మాస వ్రతానికి అనుకూలంగా నీ అనుగ్రహాన్ని ప్రసాదించుము. నీ సమర్థతతో జలపాతాలను కురిపించి, ఈ భూమిని జీవసమృద్ధితో నింపుము.

1. తటాకములను నింపవలసిన ఆవశ్యకత:
నీ వర్షాలు నదులు, చెరువులు నింపి సర్వ ప్రాణికోటికి జీవనదానం చేస్తాయి.
నీ కుంభవృష్టి భూమిని సారవంతముగా మార్చి పంటలకు జీవశక్తి ఇస్తుంది.
2. పంజరంలా నిండి గర్జించు నీ నాదం:
నీ గర్జన భూమ్యాకాశాలను బ్రద్దలగించునట్లుగా శక్తివంతంగా వినిపించాలి.
నీలమేఘశ్యాముడైన శ్రీమన్నారాయణుని వలే నీలివర్ణాన్ని ధరించి, ప్రకృతిని అందంతో ముంచేయవలసిన సమయమిది.
3. పాంచజన్యము వలే మెరుస్తూ:
నీవు కురిపించే శరావర్షం పాంచజన్య శంఖం వలే మెరుస్తూ ప్రపంచానికి శ్రేయస్సు తీసుకురావాలి.మేము స్నానమాచరించే పవిత్ర కాలంలో నీ వర్షాలు ఆ భగవంతుని ప్రసాదములా అనిపించాలి.

**పిలుపు:**గొల్లభామలతో కలిసి ఆచరిస్తున్న ఈ వ్రతానికి నీ సహాయాన్ని కోరుతున్నాం, ఓ పర్జన్య దేవా!

1. నీ వర్షాలు కేవలం భూమిని మాత్రమే కాదు, మనసులను కూడా ఆహ్లాదపరిచేలా ఉండాలి.
2. నీ గర్జన ప్రకృతికి కొత్త జీవశక్తిని నింపాలి.
3. నీ కుంభవృష్టి, ఈ ప్రపంచంలో జీవరాశులందరికీ శ్రేయస్సును అందించాలి.

మేము ఆ భగవంతుని పూజించే ఈ పవిత్ర సమయాన్ని నీ ప్రకృతి రూపం ద్వారా మరింత పవిత్రంగా మార్చు. నీ వర్షాలతో ఈ పుడమిని సమృద్ధిగా నింపి, ప్రకృతి జీవనానికి ఒక కొత్త ఆరంభం తీసుకురా.

**ఇదే మా వ్రతం, ఇది మా ప్రార్థన!**ఈ విశ్వానికి జీవసమృద్ధిని అందించే నీ శక్తి అందరికీ అనుకూలంగా ఉండాలని మేము ఆశిస్తున్నాం. మా ధనుర్మాస వ్రతం నీ అనుగ్రహంతో ఫలప్రదమవుతుందని నమ్మకం.

ఆండాళ్ తిరువడిగలే శరణం

**రచయిత - వై.ఎస్. యాదవ్,**
**చైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.**


## బాధితులకు సమర్థంగా, సులువుగా, వేగంగా న్యాయం అందించడమే లక్ష్యం

### హోంమంత్రి వంగలపూడి అనిత

ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ కోర్టులకు అవసరమైన సదుపాయాల ఏర్పాటుకు కృషి

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్ర అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అమరావతి డిసెంబర్ 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బాధితులుగా మిగిలిన సామాన్య ప్రజలకు న్యాయం జరగాలంటే వేగంగా న్యాయం జరిపించడమొక్కటే మార్గమని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. పోలీసులు, జైళ్లు, న్యాయవ్యవస్థలు సమర్థంగా పనిచేసేందుకు కావలసిన ఏర్పాట్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఆమె స్పష్టం చేశారు. తద్వారా పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో హోంమంత్రి వంగలపూడి అనిత.. న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తో కలిసి ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ కోర్టులలో ఉన్న కేసులు, పనితీరు, పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పెషల్ కోర్టులు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ఏసీబీ కోర్టులు, పోస్కో, మహిళలకు సత్వర న్యాయమందించే న్యాయ వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పోలీసు, జైళ్లు, న్యాయ వ్యవస్థల్లోని ఖాళీలను భర్తీ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో కక్షలు, ఆక్రమణలు, ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించిన అరాచకాల బారిన పడి న్యాయం కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కూటమి ప్రభుత్వం భరోసా కలిగిస్తుందని హోంమంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం పొందే హక్కు అందరికీ సమానంగా ఉంటుందన్నారు. ఆ హక్కును వినియోగించుకునే సౌలభ్యాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితులకు తక్కువ వ్యయంతో సమర్థంగా, సులువుగా, వేగంగా న్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి తెలిపారు.అల్పపీడనం నేపథ్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉత్తరాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కోస్తాంధ్రలో చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయన్నారు. రాయలసీమలో కూడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉండడంతో విపత్తు నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపి ప్రజలను అప్రమత్తం చేయాలని హోంమంత్రి ఆదేశించారు.



# యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు సీఎం కృషి

- రానున్న ఐదేళ్లల్లో 20 లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు
- ప్రతీ ఇంటిలోని యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలు ఆలోచించరు
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి






**ఏలూరు/నూజివీడు, డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ప్రపంచస్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు ట్రిబుల్ ఐటీ లో శుక్రవారం 'మెగా జాబ్ మేళా' ను మంత్రి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. రానున్న 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అంతేకాక ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్తను రూపొందించేలా ప్రత్యేక పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నామన్నారు. పాపులేషన్ సెన్సస్ లాగా 'స్కిల్ సెన్సస్' నిర్వహించి ప్రతీ ఇంటిలో యువత ఏ అంశంలో నైపుణ్యం కలిగి ఉన్నది సెన్సస్ చేపడుతున్నామన్నారు. అంతేకాక ప్రపంచస్థాయి సంస్థలు మన రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని, వారికి కావలసిన రంగంలో మన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఆయా పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో స్కిల్ హబ్ లు ఏర్పాటుచేసి, యువతను అన్ని రంగాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 2047 స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళికలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ కల్పన అంశానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని మంత్రి చెప్పారు. ఎన్టీపీసీ సంస్థ 1. 87 లక్షల కోట్ల రూపాయలతో సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి యూనిట్ స్థాపించనున్నదని, దీని ద్వారా 1. 06 లక్షల మంది యువత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ఇటీవల విదేశీ పర్యటనలో గూగుల్ సంస్థ తో సంప్రతించి గూగుల్ సంస్థ తన యూనిట్ ను రాష్ట్రంలో నెలకొల్పేలా చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా వేల కోట్ల రూపాయలతో మన రాష్ట్రంలో తన యూనిట్ ను నెలకొల్పేందుకు వచ్చిన మిట్టల్ స్టీల్ సంస్థ గత ప్రభుత్వ హయాం లో పరిస్థితులు అనుకూలించని కారణంగా ఒరిస్సా లో నెలకొల్పేందుకు ఆలోచిస్తుండగా, ముఖ్యమంత్రి చొరవతో తిరిగి మన రాష్ట్రంలో నెలకొల్పేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకుందన్నారు. రిలయన్స్ సంస్థ 65 వేల కోట్ల రూపాయలతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లు నెలకొల్పేలా మంత్రి లోకేష్ చొరవ తీసుకున్నారన్నారు. ఈ విధంగా ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలు, అదే స్థాయి టెక్నాలజీ తో తమ యూనిట్లను మన రాష్ట్రంలో నెలకొల్పి మన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపి, ప్రతీ ఇంటికి ఉద్యోగ అవకాశాలు, పారిశ్రామికవేత్తలను రూపొందిస్తే రాష్ట్రం అభివృద్ధి బాటలో నిలబడడంతో పాటు, ప్రజలు సంక్షేమ కార్యక్రమాల గురించి ఆలోచించరని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 8 స్కిల్ హబ్స్ లలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళికలో కూడా నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక స్థానం కల్పించామన్నారు. జిల్లాలో ఏ పరిశ్రమలలో ఏ ఏ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి , వాటికి ఏ ఏ విభాగంలో నైపుణ్యం అవసరం అని తెలుసుకుని వాటిల్లో యువతకు శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ పనితీరును ప్రశంసించిన మంత్రి పార్థసారథి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పనిచేస్తున్నారని మంత్రి పార్థసారథి కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పేద ప్రజలకు అవగాహన కల్పించి వాటిని వారు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, ట్రిబుల్ ఐటీ విసి అమరేంద్ర కుమార్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి జితేంద్ర కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం జాబ్ మేళా కు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి మరిన్ని హెల్ప్ డెస్క్ లు ఏర్పాటుచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## హెల్మెట్ ధరించండి -రక్షణ పొందండి

- లేనిపక్షంలో జరిమానా తప్పనిసరి




**కాకినాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే జరిమానా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హై కోర్టు వారి ఉత్తర్వులు మేరకు,మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు శనివారం నుండి విధిగా హెల్మెట్ ధరించాలని కోరినారు. చాలా కాలముగా కాకినాడ జిల్లాలో ద్విచక్ర వాహనదారులకు, విద్యార్థులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపినారు. హెల్మెట్ లేకుండా మోటార్ సైకిళ్ళు నడిపే వారి మీద శనివారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని అన్ని శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మరణించే వారిలో హెల్మెట్ లేకపోవడం వలన తలకు గాయాలు అయ్యి చనిపోవడం, గాయపడటం జరుగుతుందని తెలిపినారు. ఈ మరణాలను నివారించాలి అంటే మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. హెల్మెట్ ధరించడం వలన చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని లేనిపక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

## తిరువూరు ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన - జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశా





**తిరువూరు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** తిరువూరు ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన-జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశా. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను తనిఖీ చేసి రోగులను కలెక్టర్ పరామర్శించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి ప్రక్క రాష్ట్రాల నుంచీ సీహెచ్సీకి వచ్చి చికిత్స చేయించుకోవడం అభినందనీయమన్నారు వ్యవసాయ మార్కెట్ నందు రైతులకు తార్పాలిన్ పట్టాలను కలెక్టర్ లక్ష్మీ శా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే మాధురి, తహసిల్దార్ కే లక్ష్మి, ఏవో పి. పద్మా, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు..

## ఇళ్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోం

- సిపిఎం, బి.ఎస్.పి. నాయకుల డిమాండ్



**కంచికచర్ల,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** కంచికచర్ల గ్రామపంచాయతీ పరిధి ఉన్న అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న పేద వర్గాలకు సంబంధించిన ఇళ్లను ఆర్ అండ్ బి అధికారులు తొలగింపును నిరసిస్తూ స్థానికులు, దళిత సంఘాల, బి.ఎస్పి, సిపిఎం నాయకులు శుక్రవారం చెవిటికల్లు రోడ్డుపై ఆందోళన చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులుఎం.సోమేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ గత 60 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో దళిత సామాజిక, మరియు వివిధ వర్గాలు చెందిన 400 కుటుంబాలకు పైగా ఇల్లు నిర్మించుకొని రోడ్డుకి ఇరువైపులా నివాసం ఉంటు వారు జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి వారి ఇల్లు వెంటనే తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులు అవలంబిస్తున్న కక్షపూరితమైన ధోరణిని వెంటనే ఆపాలని సిపిఎం. బి ఎస్పీ నాయకులుడిమాండ్ చేశారు. అంబేద్కర్ కాలనీలో చేపడుతున్న ఇల్లు కూల్చివేత పనులు తక్షణమే నిలిపివేసి వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరుపున పక్కా ఇల్లునిర్మాణంచేపట్టి వీరందరికీఇళ్ల పట్టాలు తక్షణమే మంజూరు చేసి అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపి నాయక్, బి.ఎస్పీ నాయకుడు బి.ఉదయ్ కిరణ్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారుల జాడను ఇట్టే కనిపెట్టే యాప్

- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో అందుబాటులోకి..
- భవానీ దీక్షల విరమణల్లో సేవలందించనున్న ఆన్‌లైన్ వ్యవస్థ






**విజయవాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** అంతవరకు సరదా సరదాగా గడిపిన ఆ కుటుంబంలో ఒక్కసారిగా పెద్ద అలజడి.. తమతో పాటు ఉన్న నాలుగేళ్ల చిన్నారి అకస్మాత్తుగా కనిపించకపోయే సరికి అంతులేని ఆవేదన! తిరిగి ఆ చిన్నారి చెంతకు చేరేవరకు ఒకటే కలవరం.. ఇలాంటి పరిస్థితులు ఉత్సవాల సమయాల్లో చూస్తుంటాం! ఇలా తప్పిపోయిన చిన్నారుల సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు సత్వరం తెలియజేప్పేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలతో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు జరగనున్నాయి. దాదాపు అయిదారు లక్షల మంది ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సమయంలో దురదృష్టవశాత్తు తప్పిపోయిన చిన్నారుల జాడను ఇట్టే తెలుసుకునేందుకు సీఎంఎస్ యాప్‌ను ఉపయోగించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా చిన్నారుల వివరాలను నమోదు చేసి, చేతికి క్యూఆర్ బ్యాండ్ వేస్తారు.. పిల్లలు తప్పిపోయిన సందర్భంలో భద్రత, ఉత్సవాల సిబ్బంది లేదా ఎవరైనా సరే ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు ఆ పిల్లల సమాచారం తెలుస్తుంది. QR కోడ్ స్కాన్ చేసిన తర్వాత, పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, తల్లిదండ్రుల ఫోన్ నంబర్, తల్లిదండ్రులతో ఫోన్ కాల్ చేయడానికి లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించడానికి ఆప్షన్లు చూపిస్తుంది. దీంతో తేలిగ్గా చిన్నారులను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చొచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ సీఎంఎస్ పనితీరును పరిశీలించారు. చేయాల్సిన మార్పులపై అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నొవేషన్స్ సీఎండీ అనీల్ కుమార్‌కు సూచనలు చేశారు. ఈ ఆన్‌లైన్ వ్యవస్థపై ప్రజలు కూడా అవగాహన పెంపొందించుకోవాలని.. ఎక్కడైనా తప్పిపోయిన చిన్నారులు కనిపిస్తే వెంటనే క్యూఆర్ బ్యాండ్‌ను స్కాన్ చేసి.. సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

## చర్చి అభివృద్ధికి ఎన్ఆర్ఐ వితరణ




**విస్సన్నపేట,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కలగర రామచంద్రపురం చర్చి అభివృద్ధికి ఎన్ఆర్ఐ గిరి తమ తండ్రి వెంకటేశ్వర రావు చేతుల మీదుగా 50 వేల రూపాయలు విరాళంను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్న బాబు వరప్రసాద్ మోహన్ కూటమి నేతలకు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల అధికారులకు అడ్వాన్స్ క్రిస్టమస్ శుభాకాంక్షలు



**విస్సన్నపేట,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో లూర్ధు నగర్ అంబ్రోస్ చర్చ్ బోధకులు ఆధ్వర్యంలో అడ్వాన్స్ క్రిస్టమస్ వేడుకలను ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు ఉద్యోగులు పాల్గొన్నారు. వారందరికీ బాల యేసు నాధుని సమక్షంలో కేకు కట్ చేసి స్వీట్ అందించి అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్టమస్ తాత ప్రత్యేక ఆకర్షణగా నిలవడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు.

## 13 బెల్ట్ కేస్ లు ...8 మంది బైండ్ ఓవర్




**తిరువూరు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** తిరువూరు ప్రొహిబ్ బేషన్ మరియు ఎక్సైజ్ పరిధిలో గల నాలుగు మండలాలలో గత మూడు రోజులుగా బెల్ట్ షాప్ లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది వాటిలో భాగంగా 13 కేసులను నమోదు చేయడం జరిగింది. 9.5 లీటర్ల నాటు సారాయి,97 మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నాము. గంపలగూడెం మండలంలో 5 తిరువూరు మండలంలో 2 ఏ.కొండూరు మండలంలో 1 ఎమ్మార్వో ముందు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కేసుల్లోనీ పాత ముద్దాయిలను బైండోవర్ చేయడమైనది.

## అటవీ శాఖ అధికారుల వేధింపులు తాళలేక వృద్ధుడు ఆత్మహత్యాయత్నం



**నూజివీడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం, నర్సుపేట గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు అటవీ శాఖ అధికారుల వేధింపులు తాళలేక పురుగులు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం నర్సుపేట లోని తన మామిడి తోటలో పురుగుల మందు సేవించిన వృద్ధుడు అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సరైన సమయంలో చికిత్స అందడంతో వృద్ధుని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... నూజివీడు మండలం నర్సుపేట గ్రామానికి చెందిన శెట్టిపల్లి రాఘవులు గత 50 సంవత్సరాల నుండి అటవీ భూమిలో నాలుగున్నర ఎకరాలు సాగు చేసుకుని మామిడి మొక్కలు నాటడం జరిగింది. ప్రస్తుతం మామిడి చెట్ల నుండి ఎలాంటి పంట దిగుబడి రాకపోవడంతో వాటిని నరికి వేసి, ఇతర పంటలను సాగు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. మామిడి మొక్కలు నరుక్కునేందుకు అటవీ శాఖ అధికారుల అనుమతి కోసం అర్జీ పెట్టుకోగా, వారు చలానా, ఇతర అనుమతుల కోసం రైతు రాఘవుల వద్ద నుండి 50 వేల రూపాయలు కట్టించుకుని అనుమతులు ఇవ్వలేదని రైతు ఆరోపించాడు. గత కొన్ని నెలలుగా అటవీ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ప్రయోజనం లేదని, మామిడి మొక్కలు నరుక్కునేందుకు వెళ్లిన ప్రతిసారి వారు అడ్డుకోవడం జరుగుతుందని రైతు రాఘవులు వాపోయారు. శుక్రవారం సాయంత్రం తన తోటలో నరికిన మామిడి మొక్కలను లోడింగ్ చేసుకునేందుకు ట్రాక్టర్ ను తీసుకువెళ్లగా, అటవీ శాఖ సిబ్బంది అడ్డుకొని మామిడి మొక్కలు నరుక్కునేందుకు ఇంకా అనుమతులు రాలేదు... మరో 20వేలు ఇస్తే గాని అనుమతులు రావని చెప్పినట్లు రాఘవులు తెలిపారు. దీంతో మనస్థాపానికి గురైన రాఘవులు పురుగులు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అపస్మారక స్థితిలో చేరుకున్న రాఘవులును చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాఘవులు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు రాఘవులు చెప్పడం గమనార్హం.

## నేడు మనం ఇంధన పొదుపు చేయకపోతే భవిష్యత్ తరాలకు అంధకారమే

(మొదటిపేజీ తరువాయి)

ఏపీఎస్ఈసీఎం సీఈవో బి.ఏ.వి.పి. కుమార రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. విజయానంద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ఇంధన పొదుపులో ప్రథమ బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. వంసగా మూడో ఏడాది కూడా మన రాష్ట్రం అవార్డు సాధించడంలో అందరి సహకారం, సమన్వయం ఎంతో ఉందన్నారు. ఇలాగే మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గతేడాది జాతీయ స్థాయిలో 83 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచామని, ఈ ఏడాది 87 పాయింట్లు సాధించి మరోసారి మొదటి స్థానం కైవసం చేసుకున్నామని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ వివరించారు. మనం ఒక యూనిట్ ఇంధనం ఆదా చేస్తే ఒక యూనిట్ ఉత్పత్తి చేసినట్టే అని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు. ఇంధన పొదుపుతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంధన పొదుపుపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదాహరణకు ఇంటి పై భాగంగా కూల్ సర్ఫేస్ పెయింట్ వేస్తే ఇంట్లో వేడి వాతావరణం తగ్గి మార్పు కనిపిస్తుందని తెలిపారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో మనందరం భాగస్వాములమవుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తుందని, విజన్-2047 లో భాగంగా 50-60 శాతం గ్రీన్ ఎనర్జీ రాష్ట్రంగా మనం ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కరెంట్ ఆదా చేద్దాం.. భావి తరాలకు భరోసానిద్దామని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు. లైట్లు, ఎలక్ట్రిక్ పరికరాలైన ఫ్రిడ్జ్, ఇస్త్రీపెట్టె, ఏసీ, గ్రీజర్, వాషింగ్ మెషిన్, కంప్యూటర్ తదితర పరికరాల వాడకంలో నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తే సగానికి సగం విద్యుత్ ఆదా చేయవచ్చన్నారు. ఒక వారం, ఒక నెల విద్యుత్ ఆదా చేయటం కాకుండ నిత్య జీవన విధానంలో విద్యుత్ పొదుపు ఒక భాగంగా చేసుకున్నప్పుడే నూరు శాతం ఫలితాలు సాధించగలమన్నారు. సోలార్ వినియోగంపై అవగాహన పెంచుకుని సోలార్ పరికరాల వాడకం పెంచుకోవాలని అప్పుడే మనం పూర్తి ఫలితాలు పొందగలమన్నారు. సోలార్ తో పనిచేసే పరికరాల వలన విద్యుత్ ఆదా అవడంతో పాటు మనమే విద్యుత్ ఉత్పత్తి చేసుకున్నవారిమవుతామన్నారు.

## పల్లెర్లమూడి గ్రామంలో మెగా వైద్య శిబిరం



**నూజివీడు,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సౌజన్యంతో శుక్రవారం నూజివీడు గిఫ్ఫార్డ్ మెమోరియల్ హాస్పిటల్ వారిచే నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు యనమదల రమేష్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ ప్రసంగి పెదపూడి, మెటాస్ సంస్థల కంపెనీ సెక్రటరీ మనోజ్ కుమార్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, చిన్నపిల్ల వైద్య నిపుణులు డాక్టర్ యనమదల సుధీర్ కుమార్ చౌదరి, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్నం దీప్తి, కంటి వైద్యులు కె. ప్రభుదాసులు పాల్గొని వైద్య సేవలు అందించారు. నూజివీడు ఎంపీడీవో చెన్న రాఘవేంద్ర నాథ్, మంత్రి పార్థసారథి పర్సనల్ అసిస్టెంట్ రమేష్ ఈ శిబిరాన్ని సందర్శించి తగు సూచనలు ఇచ్చారు. హాస్పిటల్ వారిచే అవసరమైన వారికి ఉచితముగా రక్తపరీక్షలు చేసి మందులు అందించారు. స్థానిక సచివాలయ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు యనమదల వాసు, దావులూరి కృష్ణమోహన్ యనమదల సత్యనారాయణ (సిద్ధయ్య )బెజవాడ శ్రీనివాసరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

## కన్స్యూమర్ రైట్స్ & ప్రొటెక్షన్ చైర్మన్ గా పశుపతినాద్ బాబు



**పెడన,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖుడు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శ్రీ కాత్యాయని అమ్మవారి ఆలయ నిర్మాణ సారథి చిట్టూరి పశుపతినాథ్ బాబు (పశుపతి) వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ & ప్రొటెక్షన్ పెడన చైర్మన్ గా ఎంపిక చేసిన వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ & ప్రొటెక్షన్ ఫౌండర్ అండ్ చైర్మన్ రామానుజస్వామి. ఈ సందర్భముగా స్థానిక వాసవి క్షేత్రమునందు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పశుపతినాథ్ బాబు కి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఆశీస్సులతో పెడన పట్టణ పరిసర ప్రాంత కన్స్యూమర్స్ కు తమ అమూల్యమైన సేవలు అందిస్తూ అందరి ప్రశంసలను అందుకొని మరిన్ని ఉన్నతమైన పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా ఉత్సవముల కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ గుప్తా సభ్యులు జల్లూరి రమేష్, పాదర్తి శ్రీను, జల్లూరి రంగారావు భవిరిశెట్టి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ ఐకాన్. నాకు పెద్దన్న.. రావి ఆదర్శప్రాయుడు : ఎమ్మెల్యే రాము

**● కూటమినేతలతో కలిసి.. ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పుట్టినరోజు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**





**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** తన పోరాట పటిమతో గుడివాడ ఐకాన్ గా నిలబడగలిగే ఏకైక వ్యక్తి రావి వెంకటేశ్వరరావు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. గుడ్లవల్లేరు మండలం కూచికాయలపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు పుట్టినరోజు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టినరోజు కేక్ కట్ చేసి.. కూటమినేతలకు అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. నాకు అత్యంత ఆప్తుడు, సొంత అన్న కంటే ఎక్కువైనా రావి వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. భగవంతుని ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. ప్రజల మంచి కోసం రావి చేసిన పోరాటాలు నాలో ఎంతో స్ఫూర్తిని నింపాయన్నారు. గుడివాడ అభివృద్ధి ప్రజలకు మంచి చేసేందుకు ఆయనతో కలిసి చేస్తున్న ప్రయాణం నాకు ఎంతో ఆనందం కలిగిస్తుందని ఎమ్మెల్యే రాము పునరుద్ఘటించారు. అనంతరం గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతో.. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొడాలి రామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ద్వారకా తిరుమల పాదయాత్రను, కుచికాయలపూడి రామాలయం వద్ద ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. 20 మందితో రామరాజు పాదయాత్ర చేపట్టి తనమొక్కును తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ముళ్ళపూడి రమేష్ చౌదరి, చేకూరు జగన్మోహన్రావు, పలువురు కూటమి నాయకులు మరియు రావి అభిమానులు పాల్గొన్నారు.

# సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్..

(మొదటిపేజీ తరువాయి)

మన భూమి మన పేరుతో ఉందో లేదో ఏటా చూసుకునేవాళ్లం. అలాంటి మంచి వ్యవస్థ ఉన్న స్థితి నుంచి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన భూమి మనకు లేకుండా చేసే స్థితికి తీసుకొచ్చారు. అందుకే చెప్పిన మాట ప్రకారం మొదటి క్యాబినెట్ సమావేశంలోనే చర్చించి ఆ చట్టాన్ని రద్దు చేశామని ముఖ్యమంత్రి వివరించారు.

**రాళ్లపై ఉన్న ఫొటో తీయడానికి రూ. 12 కోట్లు అయింది:** భూముల సర్వే పేరుతో విధ్వంసం సృష్టించి.. రాళ్లపై ఫొటోలు వేసుకున్నారని.. ఆ బొమ్మలు తీయడానికి రూ. 12 కోట్లు అయిందని ముఖ్యమంత్రి వివరించారు. మొన్నటివరకు మీరు భయంభయంగా బతికారని.. భూమిని కబ్జా చేసినా, 22ఏలో పెట్టినా, భూమి మీది కాదని చెప్పినా మాట్లాడాలంటే భయపడే పరిస్థితికి వచ్చారు. కానీ.. ఇప్పుడు మీరు స్వేచ్ఛగా ఇక్కడికి వచ్చి, నేరుగా అడిగే అధికారం ఎన్డీఏ ప్రభుత్వం మీకు ఇచ్చింది. దాదాపు అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెడుతున్నాం. ఈ సదస్సుల ద్వారా 95,263 పిటిషన్లు వచ్చాయి. డిసెంబర్ 6న ప్రారంభించి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు పెడుతున్నాం. దాదాపు 3 లక్షల మంది ఈ సదస్సులకు హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మీ భూమి మీకు ఇచ్చే బాధ్యత మాది. ఇందులో ఎలాంటి అనుమానం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అత్యంత పారదర్శకంగా సమస్యల పరిష్కారం:** ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ – 2024 చట్టం తీసుకొచ్చామని.. ఎవరైనా వేరేవాళ్ల భూమిని కబ్జాచేస్తే అలాంటి వారిపై చాలా కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా మోసం చేసి భూమిని లాక్కున్నా, బలవంతంగా బెదిరించి లాక్కున్నా కొత్త చట్టం వర్తిస్తుందని, జైల్లో పెట్టే అధికారం ఇచ్చాం. ఎవరైనా ఒకసారి తప్పుచేస్తే పీడీ యాక్టు కింద జైలుకు పంపించే హక్కును చట్టం కింద తీసుకొచ్చాం. మరోవైపు ఎక్కడ భూకబ్జా జరిగినా.. భూకబ్జాకు పాల్పడినా వారిని జైల్లో పెట్టడమే కాకుండా భూమి విలువ మేరకు జరిమానా కూడా వేస్తున్నాం. ఎవరైనా ఒక సెంటు భూమి కబ్జా చేసినా ఖబడ్దార్.. తాటతీస్తాం. ఎవరినీ వదిలిపెట్టం. ఎవరైనా వేరేవారి భూమిపై కన్నేస్తే జైలు కనిపించాలి.. దాదాపు 16,816 గ్రామాలకుగాను 6,698 గ్రామాల్లో రీసర్వే చేశారు. అయితే ఈ రీసర్వేకి సంబంధించి తప్పుడు సర్వే జరిగిందంటూ దాదాపు 2,79,148 మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తాం. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు జరుగుతాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత మనం తీసుకోవాలి. నా దగ్గరికి ఒక్క పిటిషన్ కూడా రాని రోజున సమర్థవంతంగా పని చేసినట్టు లెక్క అని అన్నారు. ఒకవేళ నా దగ్గరికి ఒక పిటిషన్ వచ్చినా.. అది పరిష్కారం చేయలేని సమస్య అయి ఉండాలన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతి గ్రామంలో రెవెన్యూ మ్యాపు, ప్రభుత్వ, ప్రైవేటు భూములన్నింటినీ ప్రదర్శిస్తున్నాం. అభ్యంతరాలుంటే చెప్పమంటున్నాం. ఎస్ఎల్ఆర్, ఆర్ఆర్, 1బీ రిజిస్టర్, 22ఏ జాబితా అన్నింటినీ పారదర్శకంగా పెడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసుల పేర్ల నమోదు, సరిహద్దు సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వేలో రికార్డు అయిన తప్పులు, భూకబ్జాలు, అసైన్డ్ భూముల పరాధీనం, నిషిద్ధ భూములు, 22ఏ నుంచి తొలగింపు.. వీటన్నింటినీ పరిశీలిస్తాం. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం. ఒకసారి రికార్డు అప్‌డేట్ అయిన తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలిస్తాం. క్యూఆర్ కోడ్ కూడా పెట్టి, జియో ట్యాగింగ్ కూడా చేస్తామని వివరించారు. ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలించుకునే అవకాశం లభిస్తుందన్నారు. నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకొని అన్నింటినీ పూర్తిచేస్తామని తెలిపారు.

**మీ ఇంటి జాగా మీకిచ్చే బాధ్యత మాది:** ఇక్కడ గ్రామంలో బీసీ కాలనీ.. అతిపెద్ద సమస్య.. 176 ఇంటి జాగాలు.. ఎన్టీఆర్ గారి హయాంలో ఇచ్చాం. ఈరోజు ఈ జాగాలను 22ఏకి ఎక్కించి ఇది మీ భూమి కాదు.. ప్రభుత్వ భూమి అని చెప్పి ఇబ్బందిపెట్టే పరిస్థితికి వచ్చారు. మీ అందరికీ ఒకటే హామీ ఇస్తున్నాం.. మీకు భేషరతుగా పట్టాలు ఇచ్చే బాధ్యత మేము తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 22ఏ జాబితాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చట్టపరంగా పరిశీలించి చేసి వారిపట్టాలు వారికిచ్చేలా చేస్తాం. ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనేది తన ఆలోచన అని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు.

# సిపిఐ బలోపేతానికి కృషి చేయాలి -సిపిఐ జిల్లా కార్యదర్శి తాతయ్య

**● సిపిఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి..**



**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** సిపిఐని బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి, సిపిఐ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను గుడివాడ నియోజక వర్గంలో ఘనంగా నిర్వహించాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఏఐటియుసి 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, పేదల ఇళ్ళ స్థలాలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై పార్టీ పిలుపు మేరకు పోరాటాలు చేయాలన్నారు. అనంతరం షేక్ మోసకు సిపిఐ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నాయకులు కొమ్ముల సురేష్, స్వామి, అంజి, పద్మారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు.. ఎమ్మెల్యే రాము

**● బొమ్ములూరు గ్రామంలో రూ.56 లక్షలతో నిర్మించిన.. ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే**



**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు సైతం సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలియచేశారు. గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామంలో రూ.56 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న.. 60వేల లీటర్ల సామర్థ్యం గల హెడ్ వాటర్ ట్యాంక్ ను ఎమ్మెల్యే రాము శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన వాటర్ ట్యాప్ ల ద్వారా ప్రజలకు.. త్రాగునీటిని ఎమ్మెల్యే రాము విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్యాంక్ నిర్మాణానికి స్థల దానం చేసిన.. గ్రామస్తుడు త్రినాధరావును అభినందిస్తూ ఎమ్మెల్యే రాము శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైకాపా అసమర్ధ పాలనలో గ్రామాల్లో నీటి వ్యవస్థ సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి వ్యవస్థను మెరుగుపరిచి.. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించే దిశగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బొమ్ములూరు గ్రామంలో వీధి వీధికి పైప్ లైన్.. ఇంటింటికీ కులాయి పనులు 90 శాతం పూర్తి అయ్యాయని.. మిగిలిన 10 శాతం పనులు అతి త్వరలో పూర్తికానున్నట్లు ఎమ్మెల్యే రాము తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, తాసిల్దార్ రామకోటేశ్వరరావు, ఆర్డబ్ల్యూసీ ఏ.ఈ అట్లూరు వెంకటేశ్వరరావు, ఆర్.ఐ నాగబాబు, ఈఓపిఆర్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె. రామ్మోహన్రావు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సాల్మన్ రాజ్, టిడిపి నాయకులు లింగం బాబ్జి, కొత్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, బుర్ల సుబ్బారావు, బోయిన సుబ్బయ్య, గుత్తా చంటి, ముత్యాల విజయ్ కుమార్, సొంటి నాగేశ్వరరావు, గుత్తా ఆజాద్, పూసల నాంచారయ్య, నవీన్ మరియు గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన ఎన్.టి.ఆర్. స్టేడియం పవర్ లిఫ్టర్..



**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** ఈనెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ వారు నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించినారు. ఈ పోటీలలో స్థానిక ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్‌కు చెందిన పవర్ లిఫ్టర్ జి. దుర్గా సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించి 74 కేజీల శరీర బరువు విభాగంలో డెడ్ లిఫ్ట్ నందు 225 కేజీలు బరువు నెత్తి "బంగారు పతకం" సాధించడం విశేషం. ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ళ వెంకటేశ్వర రావు శిక్షణలో ఈ క్రీడాకారుడు విజయాన్ని సాధించినాడు. ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాస రావు మరియు సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్ లు విజయం సాధించిన క్రీడాకారుడుని మరియు శిక్షణ ఇచ్చిన కోచ్‌ను అభినందించినారు.

# ఎండనకా.. వాననకా గిరి పుత్రుల కోసం పని చేస్తా..

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చారు. ఆ సొమ్ములు మళ్లించారు. రుషికొండ ప్యాలస్ కు విలువైన ప్రజాధనం వెచ్చింది వృథా చేశారు. గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదు. రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన గ్రామాలకు సంబంధించి తీసుకొచ్చిన రూ. 690 కోట్లు ఎక్కడికి వెళ్లాయో తెలియదు. ఏనాడు గిరిజన ప్రాంతాల్లో ఒక్కసారి కూడా గత పాలకులు సందర్శించిందే లేదు. గిరిజనుల బతుకులు, వారి వెతలు తెలుసుకున్నదే లేదు. నేను వెంటనే అద్భుతాలు చేస్తానని చెప్పటం లేదు. ఒక సంవత్సరం సమయం నాకు ఇవ్వండి. గిరిజన ప్రాంతాల్లో మార్పు అనేది కచ్చితంగా చూపిస్తాను. మేము పాలన ప్రారంభించిన ఆరు నెలలకే గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. గిరిజన ప్రజల కోసం ఎండనకా... వాననాకా పనిచేస్తానని మాటిస్తున్నాను.

**పర్యాటక అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి..** నేటి యువతే రేపటి భవిష్యత్తు. యువత ప్రతి అంశంలోనూ నైపుణ్యం పెంచుకోవాలి. ఇక్కడి ప్రకృతి రమణీయత చూస్తే నాకే ఆశ్చర్యం కలుగుతోంది. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే యువతకు బోలేడు ఉపాధి కలుగుతుంది. పర్యాటకులు, ప్రకృతిపై అధ్యయనం చేసేవారు ఇటుగా వస్తే గిరిజనుల జీవన శైలి మెరుగవుతుంది. టూరిజం ద్వారా జీవన స్థితిగతులు మెరుగవుతాయి. దీనికోసం ఆలోచన చేస్తాం. ఇంత అద్భుతమైన ప్రదేశాన్ని జీవనోపాధి కేంద్రంగా తయారు చేస్తాం. నేను మాటలు చెప్పే మనిషిని కాదు. దీనిపై ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో పకడ్బందీగా ముందుకు వెళ్లే ఆలోచన చేస్తాం. ఇక్కడి వనరులు, వ్యవసాయ ఫలాలు స్థానికులకు దక్కేలా ప్రయత్నం చేస్తాం.

# దేవస్థానం భూమిని అక్రమణ చేసిన వారీపై చర్యలు గైకొనాలి..

**● మాజీ సర్పంచ్ మసిముక్కు వేణుగోపాలరావు**



**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** శుక్రవారం నందివాడ మం॥ కుదరవల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో దేవస్థానం భూమి అక్రమణ చేసిన వారీపై చర్యలు తీసుకొని.. దేవుడు భూమిని కాపాడవలసినదిగా మాజీ సర్పంచ్ మసిముక్కు వేణుగోపాలరావు మండల రెవిన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. నాయుడు గూడెం గ్రామం పెదపాడు మండలం శ్రీ సీతారామాలయం గుడికి కుదరవల్లిలో ఆర్ఎస్ఆర్ నెంబర్ 348 /1 రెండు ఎకరాల 22 సెంట్లు భూమి కలదు.. ఈ క్రమంలో ఆ భూమిని డాక్యుమెంట్స్ పుట్టించి గొర్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి పేరు మీద డాక్యుమెంట్స్ పుట్టించి 1 బీ లో కొనుగోలు అని వస్తుంది దేవాదాయ రికార్డ్స్ ప్రకారం ఇప్పటికీ దేవస్థానం భూమిగానే చూపిస్తుందని తెలియజేశారు. ఈ క్రమంలో దేవుడు భూమి ఆక్రమణ చేసిన వారి మీద తగు చర్యలు తీసుకుని దేవుడు భూమిని కాపాడవలసిందిగా అర్జీ ఇవ్వటం జరిగిందని వేణుగోపాలరావు తెలియజేశారు.

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ







**మైలవరం,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని విజయవాడ రోడ్డు లో గల భావనారుషి కళ్యాణమండపం నందు స్థానిక మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ మరియు మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్, టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, ధృవీకరణ పత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఆశాజ్యోతి పౌండేషన్ పాలడుగు వంశీకృష్ణ (USA) వారి సహకారంతో కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అద్యక్షు రాలు శ్రీపద్మ (USA) ,విశిష్ట అతిథులు గా పాల్గొన్నారు. వీరితో పాటు పాలడుగు నాగేంద్ర బాబు–ఉషారాణి దంపతులు మోస్ట్ చారిటబుల్ చైర్మన్ చనుమోలు వరప్రసాద్, మోస్ట్ గౌరవ సలహాదారు, కాటంనేని వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కోయ సుధ అధ్యక్షతన జరిగిన జరిగినసభలో చనుమోలు వర ప్రసాద్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతామని అన్నారు. మోస్ట్ ద్వారా కంప్యూటర్ శిక్షణ అందించి వారికి సర్టిఫికెట్స్ అందించామన్నారు. పాలడుగు నాగేంద్రబాబు–ఉషారాణి మాట్లాడుతూ ఆశాజ్యోతి ద్వారా అమెరికాలోనే కాకుండా ఇండియాలోనూ ఎంతో మందికి ఉపయోకరంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఇలా మహిళలకు అవకాశం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్య అతిథి శ్రీపద్మ (USA) మాట్లాడుతూ మహళలకు ఆర్దిక స్వాలంబనకు ఉపయోపడే ఉపాధి శిక్షణలు మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నామని అందులో భాగంగా 40 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేయడానికి ఆశజ్యోతి పౌండేషన్ వారి సహకారం అందించారని వెల్లడించారు. లబ్దిదారు (శిక్షణ పొందిన మహిళలు) పూర్తిగా సద్వినియోగం చేసుకొనేలా వారిని ఆర్థిక భాగస్వామ్యం చేసి నలభై మిషన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి లీల, మోస్ట్ ట్రెజరర్ అమీర్ హంజా ,సెక్రెటరీ జూలకంటి ప్రసాద్ ఉపాధ్యక్షురాలు అయ్యపు సుధారాణి, కోశాధికారి డి.విజయలక్ష్మి ,దునకా ప్రసాద్, సీతారామయ్య, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, భాను, సూరి, సురేష్ ,ట్రస్ట్ సభ్యులు దారా మాధవి, రాజ్యలక్ష్మి ఆధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# శ్రీ సాయి నాయీ బ్రాహ్మణ సంఘంచే ఎపిఎస్‌డబ్ల్యుసి చైర్మన్ రావి పుట్టినరోజు వేడుకలు





**గుడివాడ,డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు దేవరపల్లి కోటి అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పోరేషన్ (ఎపిఎస్‌డబ్ల్యుసి) చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ది గుడివాడ క్లబ్ లో శ్రీ సాయి నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశాన్ని రాష్ట్ర నాయకులు దేవరపల్లి కోటి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ ప్రజల మనిషి రావి వెంకటేశ్వరరావు జన్మదినోత్సవ వేడుకలు నాయీ బ్రహ్మణ సంఘీయుల అధ్వర్యంలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అయన మరిన్నీ పదవులను అలకరించి పేదలకు అండగా నిలవాలనీ ఆకాంక్షించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి కలయికలతో గుడివాడ నియోజకవర్గ అభివృద్ధి పథంలో నడుస్తుందనీ స్పష్టం చేశారు. అనంతరం టిడిపి సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పోతురాజు, పానేశ్వరరావు, దుర్గారావు, సుబ్రహ్మణ్యం, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం మున్సిపాలిటీ పరిధి డీకే పల్లిలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

**కుప్పం, డిసెంబర్ 20 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వంలో పేదల పొట్ట కొట్టి వారి పొట్ట నింపుకున్నారని, అన్ని వర్గాల ప్రజలను వేధించారని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. మచ్చ లేని చంద్రబాబు గారికి అవినీతి మరక అంటించేందుకు అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేశారని అన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డీకే పల్లిలో భువనేశ్వరి పర్యటించారు. మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ...చంద్రబాబు గారు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారు. ఆయనకు ప్రజలే కుటుంబం. మేము ఎప్పుడూ ప్రజల సొమ్ము దోచుకునేవారం కాదు. రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రలు చేశారు. విధ్వంస పాలనతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు గారు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ఆయన పాలనలో అభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవడం ఖాయం.


**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ**

**O.S. 1203 / 2023**

**Between :**
**Union Bank Of India,** Labbipet Br. Vijayawada. ...వాది
And
**Gutta Venkata Krishna Naidu,** Prop: M/s. Sai Krishna Caterers, Vijayawada. ...ప్రతివాది

**To,**
**Gutta Venkata Krishna Naidu,**
S/o. Adinarayana, Prop : M/S. Sai Krishna Caterers, residing at Flat No. 506, A-Block, Madhuram Landmark, Tarakarama Nagar, Opp: Lane to Priya Foods, Poranki, Krishna District, Andhra Pradesh-521137.

పై నంబరు గల దావాలో ప్రతివాది అయిన మీరు నోటీసు నిమిత్తం ది. 30.01.2025 వ తేదీన పై కోర్టువారు వాయిదా వేసినారు. కావున సదరు తేదీన మీరు గాని, మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ముందు 30.01.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నంబరు దావాలో విచారించగలరని ఇందు మూలంగా తెలయజేయడమైనది.

**(By order of the above Court)**
ఇట్లు

**M.D. Prabhakar,** M. Com; LL.M., Advocate, D.No. 31-16-30, Bullemma Veedhi, Machavaram, Vijayawada - 520004. Cell : 9290055959 e-mail:advdurgaprabhakar@gmail.com


Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188